PRGI Reg No -"APTEL/26/A1193

నేటి

# శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 45, సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, ఆదివారం - 05 - ఏప్రిల్ - 2026, వెల రూ.5/-

## ప్రపంచానికి సరితూగే విధానాలు..

# మానవ వనరులే బలం

## పర్యావరణ పరిరక్షణ దిశగా అభివృద్ధి చేస్తాం

- ★ భారత్‌లో పత్తి ఉత్పత్తి, నాణ్యతలో అగ్రగామిగా తెలంగాణ
- ★ 2047 నాటికి దక్షిణాసియా వస్త్ర పరిశ్రమ రాజధానిగా తెలంగాణ
- ★ ఇక్కడ వస్త్రోత్పత్తి పరిశ్రమ కాదు.. మనకు ఒక జీవనాధారం




హైదరాబాద్: 'భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా పత్తి ఉత్పత్తి, నాణ్యతలోనూ తెలంగాణ అగ్రగామిగా ఉంది. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ప్రపంచస్థాయిలో పేరొందిన సంస్థలు దుస్తుల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేశాయి. నైపుణ్యం, సంకల్పం, అత్యుత్తమ మానవ వనరులు, ప్రపంచానికి సరితూగే విధానాలతోపాటు వస్త్ర పరిశ్రమపై తెలంగాణకు దూరదృష్టి కూడా ఉంది. తెలంగాణ పత్తి చేల నుంచి లండన్, న్యూయార్క్, పారిస్, మిలాన్, టోక్యో, దుబాయ్ ఫ్యాషన్ షోల వరకు అనేక అంశాల్లో మేం కలిసి పనిచేస్తున్నాం. హైదరాబాద్ భారతదేశానికి మాత్రమే కాదు. .ప్రపంచానికి కూడా సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతూ హాలీవుడ్ స్థాయికి చేరింది. టాలీవుడ్, బాలీవుడ్ ఇప్పటికే హైదరాబాద్‌ను తమ నిర్మాణ కేంద్రంగా ఉపయోగిస్తున్నాయి. సినిమా రంగం ద్వారా కూడా ఫ్యాషన్ రంగాన్ని ప్రోత్సహిస్తాం. పెట్టుబడులతో వచ్చే వారికి మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, ఇతర మిగతా.. 2లో



### అమరావతి ప్లాన్-బిపై జగన్ ఆలోచన ఇదే: సజ్జల

- రాజధానిపై తమ పార్టీకి స్పష్టమైన వైఖరి ఉంది
- అమరావతి పేరుతో చంద్రబాబు శాశ్వతంగా దోచుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు
- పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు (మావిగన్) గ్రోత్ కారిడార్‌తోనే తక్కువ ఖర్చుతో నిజమైన అభివృద్ధి సాధ్యం

2లో



# గీత దాటితే సస్పెన్షన్ తప్పదు

రాజకీయాల్లో సుదీర్ఘ కాలం ఉండాలనుకుంటున్నారా? లేక ఒక్కసారే ఎమ్మెల్యేలుగా మిగిలిపోవాలను కుంటున్నారా? మీరే తేల్చుకోవాలి" అంటూ వార్నింగ్

ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు

మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత కార్యాలయాల నుంచి ఫోన్లు వచ్చినా ఎమ్మెల్యే తన పంతం వీడకపోవడం చర్చనీయాంశమైంది

వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ గౌరవాన్ని పణంగా పెట్టేది లేదు

అమరావతి: పల్నాడు జిల్లా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. మిగతా.. 2లో




# బీఆర్ఎస్‌దే విజయం..

## క్యాతనపల్లి మున్సిపాలిటీపై గులాబీ జెండా

- మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీపై గులాబీ జెండా
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బీఆర్ఎస్ కైవసం
- క్యాతనపల్లి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ దూరంగా ఉంది
- బీఆర్ఎస్-సీపీఐ కూటమికి స్పష్టమైన బలం ఉన్నది. కాంగ్రెస్ అభ్యర్థులు ఏడు స్థానాల్లోనే గెలిచారు

మంచిర్యాల: తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఘన విజయం దక్కింది. మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎరిగింది. క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ గొడిశెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. మిగతా.. 2లో

## కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి..

# సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్

- ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి
- "పట్టపగలే అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు బీహార్ గ్యాంగ్‌లను తలపిస్తోంది
- ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు చెందిన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు
- ప్రజాప్రతినిధుల కార్యాలయాలపైనే దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్టా, లేనట్టా?"



హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు చెందిన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారని, మిగతా.. 2లో

## ఉత్తరాది విద్యార్థులు తమిళం, తెలుగు నేర్చుకుంటారా?



### కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ

తమిళనాడు: కేంద్ర ప్రభుత్వం, సీబీఎస్ఈపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని అమలు చేయాలన్న ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు. మిగతా.. 2లో

## అమరావతి పనుల్లో వేగం పెంచండి..

# గడువులో రాజీ లేదు

- ★ ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉండొచ్చు, కానీ ఒక రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు"
- ★ రూ.57,821 కోట్ల విలువైన పనుల పురోగతిని ముఖ్యమంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు
- ★ ప్రస్తుతం రాజధానిలో 20 వేల మంది కార్మికులు, నిపుణులు
- ★ ఈ బృహత్కార్యంలో పాలుపంచుకుంటున్న మీరంతా చరిత్రలో భాగస్వాములు అవుతున్నారు



అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో రాజధాని నిర్మాణ పనులపై మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ మిగతా.. 2లో

## హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి హెలికాప్టర్ యాత్ర.. 9 నుంచి ప్రారంభం



- సోమశిల మీదుగా సాగే ఈ యాత్రలో కృష్ణానది, నల్లమల అడవుల అందాలను గగనతలం నుంచి వీక్షించే అద్భుత అవకాశం
- సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ పర్యాటక శాఖ ప్రణాళికలు సిద్ధం

## తమిళనాడు ఎన్నికలు... మైలాపూర్ నుంచి

# బరిలోకి తమిళిసై సౌందరరాజన్

### ఏప్రిల్ 23న జరగనున్న ఎన్నికలు

- భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన అభ్యర్థుల జాబితాను విడుదల
- మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు
- పార్టీ మాజీ అధ్యక్షుడు అన్నామలై ఎన్నికల్లో పోటీ చేయడం లేదని బీజేపీ స్పష్టం



తమిళనాడు: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఏప్రిల్ 23న జరగనున్న ఎన్నికల కోసం 27 మందితో కూడిన తొలి జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో తెలంగాణ మాజీ గవర్నర్ మిగతా.. 2లో

# ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి అమరావతి పనులు పూర్తికావాల్సిందే

## "రాజధాని నిర్మాణం అనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్ కాదు

కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవడంతోపాటు నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి

కాంట్రాక్ట్ సంస్థల తీరుపై సీఎం తీవ్ర అంసతృప్తి



రాజధాని పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల అగ్ని ప్రమాదాల్లో నిర్మాణ సంస్థల తీరును తప్పుబట్టారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్టు సంస్థలకు లేదా?అని ప్రశ్నించారు. వారి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని, ఘటన తర్వాత కూడా కాంట్రాక్టు సంస్థలు, అధికారులు సరిగా స్పందించలేదని అన్నారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా! అని అన్నారు. జరగరాని ఘటనలు జరిగితే వెంటనే అలర్ట్ చేయాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. మిగతా.. 2లో



2లో

## యుద్ధం ఆగదు.. అమెరికా శాంతి ప్రతిపాదనకు ఇరాన్ తిరస్కరణ

- ఈ విషయాన్ని రాతపూర్వకంగా కాకుండా, దాడులను మరింత తీవ్రతరం చేయడం ద్వారా స్పష్టం
- అమెరికాతో 48 గంటల పాటు కాల్పుల విరమణ పాటించాలన్న ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది
- కువైట్‌లోని బుబియాన్ దీవిలో ఉన్న అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి

## 28 జిల్లాలతో ఏపీ కొత్త మ్యాప్...!

గతంలో 13 జిల్లాలుగా ఉన్న ఏపీ, వైఎస్ జగన్ హయాంలో 26 జిల్లాలుగా మారింది

పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర పటంలో మార్పులు చేసిన ప్రభుత్వం




2లో

28 జిల్లాలతో కూడిన నూతన మ్యాప్‌ను ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ అధికారికంగా విడుదల

ఈ మ్యాప్‌లో రాష్ట్ర రాజధానిగా అమరావతిని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



# ' పోలవరం ప్రాజెక్టుకు రూ. 1, 301 కోట్ల అడ్వాన్స్ నిధులు అభివృద్ధికి కేంద్రం మరింత వేగం.! '

– బిజెపి సీనియర్ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి ప్రధాని భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూ. 1,301 కోట్ల అడ్వాన్స్ నిధులను విడుదల చేసిందని, ఇది ఎంతో శుభపరిణామం అని రాజానగరం నియోజకవర్గం బీజేపీ మాజీ ఇంచార్జి నీరుకొండ వీరన్న చౌదరి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాకు ఒక ప్రకటన చేశారు. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటివరకు మొత్తం రూ. 2,809 కోట్ల నిధులు విడుదల చేయడం విశేషమని పేర్కొన్నారు. మరింత పారదర్శకత కోసం 'స్పర్శ్' విధానాన్ని అమలు చేస్తూ పనులు పూర్తయ్యిన వెంటనే నేరుగా నిధులు విడుదల చేసే సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఇక మరోవైపు, అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించడం రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేస్తోందన్నారు. ఈ నిర్ణయాలన్నీ కలిసి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీ నాయకత్వంలో మన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగుతోందని స్పష్టంగా తెలియజేస్తున్నాయని వీరన్న చౌదరి హర్షం వ్యక్తం చేశారు.

# కేరళం రాష్ట్రంలోని పతనం తిట్ట అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం, ర్యాలీలలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు




కేరళం, నేటి శుభోదయ ::: కేరళంలో గొప్ప మార్పు, మెరుగైన సంక్షేమం, సుపరిపాలన, సెక్యులర్ విలువలను స్థాపించాలంటే ఈనెల 9న జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్ (యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో ఎల్డీఎఫ్ పూర్తిగా విఫలమైందని విమర్శించిన ఆయన, కేరళంలో పరిపాలన ప్రమాణాలు, మానవీయ విలువలు దిగజారిపోయాయని అన్నారు. నిరుద్యోగం పెరిగిపోవడంతో యువత విదేశాలకు వలస వెళుండగా, రాష్ట్రంలో ఉన్న వృద్ధులకు సరైన సంక్షేమం అందడం లేదని పేర్కొన్నారు. కేరళం అంటే సెక్యులరిజం, ఉన్నత విద్య, మానవీయ విలువల ప్రతీకగా భావిస్తాం. కానీ ప్రస్తుతం ఆ విలువలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిజం, మార్క్సిజం పేరుతో వచ్చిన ప్రభుత్వం గుండాయిజం వైపు మళ్లిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సుపరిపాలన, శాంతి, సెక్యులర్ విలువలకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్నామని, ఎవరైనా అనుమానం ఉంటే తెలంగాణకు వచ్చి పరిశీలించాలని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా ఇప్పటివరకు వేల కోట్ల భారం కుటుంబాలపై తగ్గిందని తెలిపారు. రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, పేదలకు రూ 500 గ్యాస్ సిలిండర్, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ నిర్మాణం చేపట్టామని వివరించారు. రైతులకు రూ 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం భారీ మొత్తంలో నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.రాష్ట్రంలో గత రెండేళ్లలో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. కేరళంలో యుడిఎఫ్ ప్రభుత్వం ఏర్పడితే కాలేజీకి వెళ్లే మహిళలకు నెలకు రూ 1000 ఆర్థిక సహాయం, యువతకు వడ్డీ లేని రుణాలు, సామాజిక పెన్షన్ పెంపు వంటి పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఉమెన్ చాందీ పేరుతో వృద్ధుల కోసం ప్రత్యేక బీమా పథకం తీసుకువస్తామని తెలిపారు. అలాగే వృద్ధుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించేందుకు సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కేరళం ప్రజలు మార్పు కోసం యుడిఎఫ్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సింధనూరులో శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్న మంత్రి లోకేష్

కేంద్రమంత్రులు కుమారస్వామి, సంజయ్

సేథ్ తో కలిసి సైనిక్ స్కూల్ ను ప్రారంభించిన మంత్రి



కర్ణాటక, నేటి శుభోదయ ::: కర్ణాటక రాయచూర్ జిల్లా సింధనూరులోని హోసళ్లీ క్యాంప్ లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవ వేడుకలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ తో కలిసి శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ను ప్రారంభించారు. ముందుగా స్కూల్ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు నిర్వాహకులు, స్థానిక తెలుగు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో బసవేశ్వర స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ హాస్టల్ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి మంత్రి లోకేష్ ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సైనిక్ స్కూల్ తరగతి గదులను, సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన దివంగత డాక్టర్ దండమూడి రాధాకృష్ణ జ్ఞాపకార్థం పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన డా.రాధాకృష్ణ కళాధామ పేరిట ఓపెన్ ఆడిటోరియంను వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ తో పాటు విశాఖ ఎంపీ భరత్, కర్ణాటక వైద్య విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్, కర్ణాటక కన్నడ, సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ ఎస్. తంగడగి, కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్ బోసురాజు, సింధనూరు ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లీ, శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ బి.వెంకటరావు, డైరెక్టర్లతో పాటు తో పాటు వివిధ పార్టీల నాయకులు, సింధనూరు స్థానిక తెలుగు ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొన్నారు.

# దండగర్ర మరియు దర్శిపర్రు గ్రామాల్లో ఏఎస్ ఆర్ హెచ్ ఎంసి మరియు ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ ఉచిత వైద్య శిబిరాలు మరియు అవగాహన సదస్సులు



తాడేపల్లిగూడెం, ఏప్రియల్ 04 : ప్రపంచ హోమియోపతి వారోత్సవాలలో భాగంగా శనివారం నాలుగవ రోజున ఏఎస్ఆర్ హోమియోపతిక్ మెడికల్ కాలేజ్ (ఏఎస్ఆర్‌హెచ్ఎంసి) మరియు ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా తమ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత ఉధృతం చేశాయి. పశ్చిమ గోదావరి జిల్లాలోని దండగర్ర మరియు దర్శిపర్రు గ్రామాల్లో ఈ రోజు నిర్వహించిన వైద్య శిబిరాలు ఆధునిక జీవనశైలి వ్యాధుల నివారణలో హోమియోపతి యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పాయి.

**- జీవనశైలి వ్యాధులపై ప్రత్యేక దృష్టి మరియు నిర్ధారణ పరీక్షలు**

నేటి కాలంలో వేగంగా విస్తరిస్తున్న మధుమేహం, రక్తపోటు మరియు అధిక బరువు వంటి జీవనశైలి వ్యాధులను అరికట్టడమే ఈ రోజు ప్రధాన లక్ష్యంగా సాగింది. గ్రామస్తులు మరియు కార్యాలయ సిబ్బందికి అధునాతన రక్త పరీక్షలు మరియు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ, హోమియోపతి కేవలం వ్యాధి లక్షణాలను అణచివేయడమే కాకుండా, శరీరంలోని అసమతుల్యతను సరిచేసి వ్యాధిని మూలాల నుండి నయం చేస్తుందని వివరించారు.

**- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో అవగాహన సదస్సు**

అరుగులనులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల మరియు కళాశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ శ్రీ మానుకొండ దుర్గారావు పాల్గొని, విద్యార్థులలో సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడం మరియు ప్రాథమిక దశలోనే ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండటం ఎంత ముఖ్యమో వివరించారు. హోమియోపతి ఎటువంటి దుష్ప్రభావాలు లేని, సురక్షితమైన వైద్య విధానమని విద్యార్థులకు శాస్త్రీయంగా వివరించారు.

**- వైద్య సేవలందించిన నిపుణుల బృందం**

క్షేత్రస్థాయిలో సమగ్రమైన సేవలు అందించడానికి ప్రత్యేక వైద్య బృందాలను కేటాయించారు:

– దండగర్ర ప్రాంతం : ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద కుమార్ పింగళి, డాక్టర్ వి. సరోజిని ప్రియాంక మరియు డాక్టర్ ఏ. ప్రియాంక నేతృత్వంలోని బృందం గురుకుల విద్యార్థులకు, స్థానిక ఉద్యోగులకు మరియు గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించారు.

– దర్శిపర్రు ప్రాంతం : డాక్టర్ డి. సురేంద్ర కుమార్ మరియు డాక్టర్ ప్రవీణ ఆధ్వర్యంలో గ్రామస్తులకు మరియు కార్యాలయ సిబ్బందికి వైద్య సంప్రదింపులు మరియు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో హౌస్‌సర్జన్లు మరియు ఉమర్ ఆలీషా ట్రస్ట్ వాలంటీర్లు పాల్గొని, వైద్య పరీక్షల నిర్వహణలో మరియు ఆరోగ్య సమాచార పంపిణీలో చురుకైన పాత్ర పోషించారు.

**- నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి (చీజుు) మార్గదర్శకాలు**

జాతీయ హోమియోపతి కమిషన్ ఆదేశాల మేరకు వైద్య కళాశాలలు సామాజిక ఆరోగ్య సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అందులో భాగంగానే ఏఎస్ఆర్‌హెచ్ఎంసి ఈ క్షేత్రస్థాయి కార్యక్రమాలను డాక్యుమెంట్ చేస్తూ హోమియోపతిని ఒక నిరూపితమైన వైద్య విధానంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తోంది.

**- ప్రిన్సిపాల్ విజ్ఞప్తి**

ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద కుమార్ పింగళి మాట్లాడుతూ, "ప్రాజెక్ట్ హెల్త్ తాడేపల్లిగూడెం" ద్వారా ఈ ప్రాంతమంతటా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఏవైనా పాఠశాలలు, కళాశాలలు లేదా కార్యాలయాలు తమ సిబ్బంది మరియు విద్యార్థుల కోసం ప్రత్యేక హోమియోపతి వైద్య శిబిరాలను నిర్వహించాలనుకుంటే, కళాశాల యాజమాన్యాన్ని 9866388979 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.



# గోకవరంలో ఈస్టర్ పండుగ ర్యాలీ




గోకవరం-నేటిసుబోదయ.: మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈస్టర్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని క్రైస్తవ సంఘాలు సుమారు 500 మందితో కలిసి శనివారం నాడు క్రైస్తవ ర్యాలీ నిర్వహించారు. కృష్ణునిపాలెం ఇ హెచ్ హెచ్ చర్చి నుండి ప్రారంభమై గోకవరం మెయిన్ రోడ్డు పురాతన వంతెన మీదగా ర్యాలీగాఊరు చివర వరకు , అక్కడ నుండి మురళి నగర్ మీదుగా ఎమ్మార్వో ఆఫీస్ వద్దకు చేరుకొని మరల కృష్ణుని పాలెంలో ముగించారు. క్రీస్తు బోధించిన శాంతి, క్షమాపణ దీని ముఖ్య ఉద్దేశమని క్రైస్తవ సంఘాలు తెలిపాయి. క్రీస్తు చనిపోయిన రోజును గుడ్ ఫ్రైడే గా అదేవిధంగా మరల సమాధి నుండి పునర్జీవం పొందిన రోజు ను ఈస్టర్ పండుగ గా ప్రపంచంలో క్రైస్తవులందరూ పండుగగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ క్రైస్తవ సంఘాలు పాల్గొన్నాయి.ఈ కార్యక్రమం రెవ. జుహాని హాలోనెన్, రెవ . ప్రశాంత్ కుమార్ (కన్నబాబు) హాలోనెన్, రెవ. జె. ప్రసాద్ బాబు, రెవ. మనోహర్, రెవ. ఏ. విజయ్ కుమార్, రెవ. జాన్ బాబు, రెవ. శామ్యూల్ జాన్, రెవ. ఫిలిప్ తదితరుల పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ కు సనాతన ధర్మం గుర్తుకురావాలి

**బిటీటీడీ ఛైర్మన్ పై చర్యలు తీసుకోవాలని గుడిలో పూజలు**



గోకవరం-నేటిసుబోదయ. :ఎన్నికల సమయంలో సనాతన ధర్మం, హిందూ ధర్మం అంటూ ప్రసంగించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు విషయంలో ఎందుకు గుర్తుకు రావడం లేదంటూ, బి ఆర్ నాయుడుని పదవి నుండి తప్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మంచి బుద్ధిని ప్రసాదించాలని గోకవరం మండల వైఎస్ఆర్సిపి నాయకులు శనివారం వెంకటేశ్వర స్వామి గుడిలో పూజలు నిర్వహించారు. ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన తిరుమల



తిరుపతి దేవస్థానం చైర్మన్ ఉన్న ఒక వీడియో పై వైసిపి నాయకులు స్పందించారు. గుడిలో పూజలు నిర్వహించిన అనంతరం, స్థానిక ప్రెస్ క్లబ్ నందు పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గుల్లా ఏడుకొండలు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నెయ్యి కల్తీ జరగలేదని, సాక్షాత్తు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ప్రస్తుత టిటిడి చైర్మన్ ఒక మహిళతో ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వస్తున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై ఒక మహిళ స్వయంగా ఫిర్యాదు చేసినప్పటికీ, జనసేన మాత్రం స్పందించకపోవడం దారుణం అన్నారు. రాష్ట్ర వైస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జాయింట్ సెక్రటరీ సుంకర వీరబాబు, మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, దళితులు పై జరుగుతున్న దాడులకు బాధ్యత వహించి హోం మంత్రి రాజీనామా చేయాలన్నారు.

మచిలీపట్నం నుండి గుంటూరు వరకు 110 కిలోమీటర్ల జాతీయ రహదారి ఉన్న ఈ ప్రాంతాన్ని రాజధాని ప్రాంతంగా పరిగణించాలన్నారు. లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినప్పటికీ, రాజధాని పనులు ఎప్పటికీ పూర్తి అవుతాయో తెలియని పరిస్థితిలో ఉన్నామన్నారు. పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గంలో మహిళను లాటితో కొట్టినప్పటికి ఆయన స్పందించరని, రాష్ట్రంలో దారుణమైన పరిపాలన కొనసాగుతుందని అన్నారు. గత వైసిపి హయంలో చిన్న ఆడియో టేప్ వచ్చిన కారణంగానే అప్పటి ఎస్ వి బి సి భక్తి ఛానెల్ చైర్మన్ పదవి నుండి పృథ్వీరాజ్ ను తొలగించి, జగన్మోహన్ రెడ్డి హిందూ ధర్మంపై తనకున్న మక్కువను చాటుకున్నారని వైఎస్ఆర్సిపి గోకవరం మండల అధ్యక్షులు పాటి రాంబాబు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి టిటిడి చైర్మన్ పై చర్యలు తీసుకునే విధంగా బుద్ధిని ప్రసాదించాలని తాము వెంకటేశ్వర స్వామిని కోరుకున్నామని పాటి రాంబాబు అన్నారు. స్థానిక వైసీపీ నాయకులు తోలేటి రాంప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, బూల అబ్బులు,బిజ్జి రాజు,అంబటి అబ్రహం,నరాలశెట్టి శివ, విరచంద్రం, నగూర్ వల్లీ బాబా,జోగరావు, సూర్యారావు, రెడ్డి,వజ్రంగి ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.




# ఇర్రిపాకలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రలతో కూడిన పాస్ పుస్తకాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కాకినాడ జిల్లా జగ్గంపేట ఏప్రిల్ 4 నేటి శుభోదయ :రికార్డులు ట్యాపరింగ్ చేయకుండా బార్ కోడింగ్, ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకలో 762 మంది రైతులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. తహసిల్దార్ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో వైసిపి నేతలు రెవెన్యూ రికార్డులను ట్యాపరింగ్ చేసి నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించారని, వీటి ద్వారా సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ఎగవేవేశారని విమర్శించారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేని ల్యాండ్ టైటిలింగ్ యాక్టును కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జగన్ ఇప్పటికీ అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని, ఆయన పార్టీ ఎన్నికల్లో పోటీ



చేయకుండా ఎన్నికల మిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. కుటమి ప్రభుత్వం రాజ ముద్ర తో కూడిన పాస్ పుస్తకాలు పంపిణీ తో పాటు భూమి హక్కుదారుడైనటువంటి రైతు ఫోటో ముద్రించి క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలు తెలుసుకునే విధంగా పాస్ పుస్తకం తయారు చేయడం జరిగిందని జగన్ తన బొమ్మలతో పాస్ పుస్తకాలు ముద్రించి రాష్ట్రంలో రైతుల భూమిని తన సొంత భూమి లాగా ఫోజు కొట్టాడని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, క్లస్టర్ ఇంచార్జి బస్వా చినబాబు, ఇర్రిపాక గ్రామ టిడిపి అధ్యక్షులు జ్యోతుల నాగబాబు, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోదిరెడ్ల సుబ్బారావు, జ్యోతుల సత్యమూర్తి, పంతం సత్యనారాయణ, పంతం తమ్మి రాజుబాబు, జ్యోతుల వీరభద్రరావు జగ్గంపేట రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి మంగపతి నాయుడు బాబు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# దాసరి విక్రాంత్ కుటుంబాన్ని పరామర్శించిన తోట నరసింహం



గోకవరం-నేటిసుబోదయ.:మండల కేంద్రమైనా గోకవరం గ్రామంలో ఇటీవల మరణించిన దాసరి విక్రాంత్ వారి కుటుంబ సభ్యులను జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు తోట నరసింహం వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ విభాగం జనరల్ సెక్రెటరీ దాసరి చిన బాబు, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం జాయింట్ సెక్రెటరీ సుంకర వీరబాబు, గోకవరం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాటి రాంబాబు, సమ్మిటి సూర్యనారాయణ మూర్తి , సమ్మిటి రాంబాబు, గోకవరం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వాలంటరీ విభాగం అధ్యక్షుడు అధికారి నాగేశ్వరరావు (బుజ్జి), అచ్చుతాపురం గ్రామ సర్పంచ్ శ్రీను , సమ్మిట మోహన్ , గొన్యాల కృష్ణార్జున తదితర గోకవరం గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# అన్న క్యాంటీన్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ




విజయవాడ, ఏప్రిల్ 4 (నేటి శుభోదయ):- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, వీఎంసి స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మీశ శనివారం ఉదయం గాంధీజీ మహిళా కళాశాల వద్దగల అన్న క్యాంటీన్లో [illegible]లో పరిశీలించారు. టోకెన్ కౌంటర్లో ఐదు రూపాయలు చెల్లించి క్యూలో నుంచొని, అక్కడ భోజనానికి వచ్చిన ప్రజలతో వారి సమస్యలను అన్నా క్యాంటీన్ పై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ తాము కూడా ఆహార నాణ్యత పరీక్షించేందుకు భోజనం చేశారు. అన్న క్యాంటీన్లో వసతులు ఎలా ఉన్నాయి? వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఐదు రూపాయలకి ప్రభుత్వం భోజనం అందించడం చాలా సంతోషకరమైన విషయమని వారు సగర్వంగా కేవలం 15 రూపాయలకే ఎవరి దగ్గర చేయిచాచకుండా వారి రోజుని గడుపుతున్నామని దీనికి ప్రభుత్వానికి వాళ్ళు కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.


# పాత దుస్తులతో బ్యాగులు పర్యావరణానికి మేలు

**విద్యార్థుల్లో సృజనాత్మకతకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అభినందనలు**




విజయవాడ, ఏప్రిల్ 4 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శనివారం ఉదయం వన్ టౌన్ లో గల మహాత్మా గాంధీ పాఠశాలలో వినియోగించిన పాత దుస్తులతో బ్యాగుల తయారీ పోటీల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాత దుస్తులను తమ చేతులతో బ్యాగ్ కుట్టి తీసుకువచ్చిన వారితో మాట్లాడారు. ఈ బ్యాగ్ దేనితో కుట్టారు? అని అడిగితే, వారు పాత దుస్తులతో కుట్టామని సమాధానం ఇచ్చారు. పాత దుస్తులను మనం ఎందుకు వాడాలి? అని అడగ్గా ఏదైనా వస్తువుని తిరిగి వాడటం, (తీవ-బంవ) వ్యర్థాలని తగ్గించడం(తీవసబంవ) అవుతుందని వారు సమాధానం ఇచ్చారు. పాత గుడ్డలనే ఎందుకు వాడాలి ప్లాస్టిక్ ని వినియోగించొచ్చుగా? అని అడిగితే, సింగిల్ యూస్ ప్లాస్టిక్ హానికరం అందుకే పర్యావరణహితమైన వస్తువులనే వాడాలి అని విద్యార్థులు కలెక్టర్ కు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్, వీఎంసి స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి లక్ష్మీశ పాత దుస్తులతో అందమైన బ్యాగులుగా కుట్టి తీసుకొచ్చిన విద్యార్థిని విద్యార్థులకు అభినందించారు, వారి సృజనాత్మకతను మెచ్చుకున్నారు. ఇలాగే ప్రతి ఒక్కరు వారు కుట్టి తీసుకువచ్చిన గుడ్డ సంచులను వాడాలని వారి తల్లిదండ్రులకి ఆ సంచులనే మార్కెట్ కి తీసుకువెళ్లి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని అన్నారు. తాజాగా వచ్చిన అధ్యయనం ప్రకారం సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడటం వల్ల తల్లిపాలలో కూడా మైక్రో ప్లాస్టిక్ అవశేషాలు కనిపిస్తున్నాయని. ప్లాస్టిక్ భూమిలో కరగనందున అది మన పర్యావరణం లో హానికరమైన పదార్థంగా మారుతోందని అందుకే పర్యావరణహితమైన వస్తువులనే వాడాలని, కేవలం వాతావరణానికి, భూమికి హాని కలుగుతున్నందుకే కాదు, మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవటానికైనా ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి అన్నారు. వేడి వేడి ఆహారం, ప్లాస్టిక్ లో వేయడం వలన హానికారక రసాయనాలు అందులో ఉత్పన్నమవుతాయని, ఆ ఆహారాన్ని మనం తినటం వలన అది క్యాన్సర్ కు దారితీస్తుందని అన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త అన్నారని, వారిలో ఉన్న సృజనాత్మకతను విస్తృతంగా వాడి ప్రజలకు అవగాహన కల్పించే విషయంలో ప్రధాన పాత్ర పోషించాలని అన్నారు. ఈ వేసవి సెలవుల్లో పాత గుడ్డలతో ఎక్కువ సంఖ్యలో బ్యాగులను తయారు చేయాలన్నారు. ఎవరైతే ఎక్కువ బ్యాగులు చేస్తారో వారికి ప్రత్యేక అవార్డును ఇస్తామని వారి తల్లిదండ్రులను సన్మానిస్తామని తెలిపారు. అలా విద్యార్థులు కుట్టిన గుడ్డ సంచులను రైతుబజార్లలో ప్రజలకు ఉచితంగా ఇచ్చి వారికి అవగాహన కల్పించి కేవలం గుడ్డ సంచులను వాడేటట్టు సమాజంలో ఒక మార్పు తీసుకొద్దామని విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చంద్రకళ, విజయవాడ నగరపాలక సంస్థ జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సాంబశివరావు, వీఎంసి అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి అన్నపూర్ణ, గాంధీజీ మున్సిపల్ స్కూల్ హెడ్ మాస్టర్ కె. మల్లికార్జున్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


# సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, ఏప్రిల్ 4 (నేటి శుభోదయ):- బావజీపేటలోని 196 సచివాలయంలో ఆకస్మిక తనకి నిర్వహించారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. శనివారం ఉదయం సచివాలయం సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సచివాలయంలో ఉన్న సిబ్బందితో ఆ పరిధిలో గల సమస్యలన్నీ సమీక్షించారు. ఎమినిటీ సెక్రటరీని ప్రతిరోజు త్రాగునీటి పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా? త్రాగునీటి సమస్యలు ఏమైన ఉన్నాయా ? ఆ పరిధిలో పాట్ హోల్స్ ఎన్ని ఉన్నాయి? అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యలు ఏమైనా తలెత్తుతున్న వంటి విషయాలపై పూర్తి స్థాయిలో సమీక్షించారు. అలాగే సచివాలయం శానిటరీ సెక్రటరీని ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఎవరైనా వ్యాపారం చేస్తున్నారా? ఆర్వో ప్లాంట్ ఉన్నవారు నీటి పరీక్షల రిపోర్టులను సమర్పించారా? సచివాలయం పరిధిలోగల పారిశుధ్య నిర్వహణ వంటి విషయాలపై సమీక్షించారు. ప్లానింగ్ సెక్రటరీ తో ఆ పరిధిలో గల అనధికార కట్టడాలు, ఫ్లెక్సీలు, ఎల్ఆర్ఎస్ పురోగతి వంటి అంశాలపై చర్చించారు. అడ్మిన్ సెక్రటరీ తో పన్ను వసూళ్ళు పై సమీక్షించారు. ఏఎన్ఎంలు, ఈడిపిఎస్, వెల్ఫేర్ విఆర్వో, మహిళ పోలీస్ వారితో సచివాలయం పరిధిలో గల సమస్యలను ఏమైన ఉంటే తమకు తెలుపగలరని ఆ పరిధిలో ప్రజలకు ఎటువంటి సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రిద్దాం

**-ప్లాస్టిక్ బ్యాగ్యు విక్రయిస్తున్న షాపులపై దాడులు**




గుడివాడ, ఏప్రిల్ 4( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గుడివాడ పురపాలక సంఘం పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మొత్తం 12 దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం గుర్తించారు. ఈ తనిఖీల సందర్భంగా సుమారు 28 కిలోల ప్లాస్టిక్ పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై మొత్తం రు.18,000 జరిమానా విధించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రింది ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించరాదన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, శ్రీ గ్లాసులు, ప్లేట్లు ప్లాస్టిక్ స్ట్రాలు థర్మాకోల్ వస్తువులు, ప్లాస్టిక్ కవర్లు మరియు ప్యాకేజింగ్ మెటీరియల్, ప్లాస్టిక్ కట్లరీ (స్పూన్లు, ఫోర్కులు, నైఫ్స్ 120 మైక్రాన్ కంటే తక్కువ ప్లాస్టిక్ బ్యానర్లు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. ప్రజలు మరియు వ్యాపారులు పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకుని, గుడ్డ బ్యాగులు, కాగితం సంచులు వంటి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.

# రాజధానిపై జగన్ ది గంటకో మాట

**-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**-రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఆ 11 సీట్లు కూడా రావు**
**-జగన్ కు మంచి వైద్యమందించాలని వైసీపీ శ్రేణులే గొణుక్కుంటున్నాయి : మంత్రి సవిత**
**-పూల మార్కెట్‌కి ప్రారంభించిన మంత్రి సవిత**



పెనుకొండ, 'ఏప్రిల్ 4 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) దేశం మొత్తం ఏపీ రాజధాని అమరావతి అని అంటుంటే జగన్ మాత్రం గంటకో మాట మాట్లాడుతున్నాడు. ఒకసారి అమరావతే రాజధాని అంటారు. మరోసారి మూడు రాజధానులంటారు. ఇంకోసారి మావిగన్ అంటారు. తాను ఉంటున్న లోటస్ పాండ్ ప్యాలెస్ కూడా రాజధానే అని అంటున్నారు. జగన్ కు మంచి వైద్యం అందించాలని స్వయాన వైసీపీ నాయకులు గొణుక్కుంటున్నారు ' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. తన పార్టీ ఉనికి కోసమే జగన్ చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలు పట్టించుకోవడంలేదన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజతో పాటు రూ.6 లక్షలతో నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఘనగిరి పూల మార్కెట్ ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెనుకొండ పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. పూల వ్యాపారులను ప్రోత్సహించేలా పూల మార్కెట్ ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించేందుకు రూ.50 లక్షలతో శానిటేషన్ సెంటర్లను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.5 కోట్లతో చేపట్టిన పనులు త్వరలో పూర్తి కానున్నాయన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మడకశిర రోడ్ వరకు కూడా సెంటర్ లైటింగ్ ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆ 11 సీట్లు కూడా రావు విలేకరులకు అడిగిన ప్రశ్నకు మంత్రి సవిత స్పందిస్తూ గంటకో మాట మార్చే వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. దేశం మొత్తం ఏపీ రాజధాని అమరావతి అని అంటుంటే జగన్ మాత్రం గంటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ఒకసారి అమరావతే రాజధాని అంటారని, మరోసారి మూడు రాజధానులని, ఇంకోసారి మావిగన్ అని, తాను ఉంటున్న లోటస్ పాండ్ ప్యాలెస్ కూడా రాజధానే అని అంటున్నారని అన్నారు. ఇలా రాజధానిపై గంటకో మాట మాట్లాడే జగన్ కు మంచి వైద్యం అందించాలని స్వయాన వైసీపీ నాయకులు గొణుక్కుంటున్నారని మంత్రి సవిత అన్నారు. అమరావతి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురిచేయడం వల్లే వైసీపీకి ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో గతంలో వచ్చిన సీట్లు కూడా రావని వ్యాఖ్యానించారు. గెలిచినప్పుడు ఒకలా, ఓడినప్పుడు మరోలా వ్యవహరించే వ్యక్తి జగన్ అని మంత్రి సవిత విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# రాజధానిపై జగన్ విధ్వంసం అమరావతిపై చంద్రబాబు విజయం

**అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చి రాష్ట్ర అభివృద్ధి**
**-జగన్ విధ్వంసానికి చెక్‌ల అమరావతి జయభేరి**
**-విశ్వసనీయతపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు**
**-జగన్‌పై విరుచుకుపడ్డ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



అమరావతి,ఏప్రిల్ 4(అజయ్ నారగాని - నేటి శుభోదయ )రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలు చూస్తే జగన్ పాలన పూర్తిగా విధ్వంసానికి ప్రతీకగా నిలిచిందని, అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి పునర్నిర్మాణం విజయపథంలో దూసుకెళ్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు తెలియజేయడం ప్రభుత్వం బాధ్యత అని, గత వారం రోజులుగా 5 కోట్ల మంది ప్రజలు ఆనందోత్సవాలతో పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో పార్లమెంట్, రాజ్యసభలో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, అయోధ్య రామమందిరం, జూలూ, వక్ఫ్ బిల్లు సవరణ, మతమార్పిడి వ్యతిరేక చట్టాలు వంటి అనేక అంశాలపై రాజకీయ పార్టీల మధ్య విభేదాలు వచ్చినా ఎక్కడా ఏకాభిప్రాయం రాలేదని అన్నారు. అయితే అమరావతి చట్టబద్ధత విషయంలో దేశంలోని 50కి పైగా రాజకీయ పార్టీలు మద్దతు తెలపగా కేవలం వైసీపీ మాత్రమే వ్యతిరేకించి పార్లమెంట్‌లో వాకౌట్ చేసిందని విమర్శించారు. తెలుగు జాతి రాజధాని అమరావతిపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న కక్ష చరిత్ర చూస్తే అర్థమవుతుందని, చంద్రబాబు ఎప్పుడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా 5 కోట్ల మంది ఆంధ్రుల అభివృద్ధినే దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నష్టం జరగకుండా చివరి నిమిషం వరకు పోరాడిన నాయకుడు చంద్రబాబేనని గుర్తుచేసి, అడ్డగోలుగా రాష్ట్రాన్ని విడదీసి ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రాంతాలు, వర్గాల మధ్య విభేదాలు రాకుండా అన్ని రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తీసుకొచ్చి, హైదరాబాద్‌లో 13 గంటల పాటు ఎమ్మెల్యేలతో చర్చలు జరిపి అందరి అభిప్రాయంతోనే అమరావతిని రాజధానిగా ప్రకటించారని తెలిపారు. ఆ సమయంలో వైసీపీ కూడా అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపిందని, "ఇక్కడే ఇల్లు కట్టుకుంటాను, రాజధానిని మార్చను" అన్న జగన్ అధికారంలోకి వచ్చాక మాట మార్చి అమరావతిని శ్మశానం, ఎడారి అంటూ దూషించారని, ఒక జాతి, కులంపై నీచ వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. అమరావతిలో అవినీతి జరిగిందని ఆరోపించినా ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారని, విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని, రాజధాని విషయంలో తొమ్మిది సార్లు మాట మార్చారని విమర్శించారు. అమరావతిని నమ్మి 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని, ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ కావడంతో ప్రభుత్వ ఖజానా నుంచి రూపాయి ఖర్చు అవసరం లేదన్నారు. 20142019 మధ్య టీడీపీ హయాంలో 54 వేల కోట్లతో ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేశామని, కానీ 2019లో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల మయం చేసి అభివృద్ధిని పాతరేసారని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 18 నెలల్లోనే జగన్ చేసిన విధ్వంసాన్ని సరిచేసే పనులు ప్రారంభించి అమరావతి అభివృద్ధి, భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్ట్ నిర్మాణం, కొత్త పెట్టుబడులు తీసుకువస్తున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ డయాఫ్రం వాల్‌ను 18 నెలల్లో పూర్తి చేసి త్వరలోనే ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేస్తామని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను 13 వేల కోట్లతో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లామని చెప్పారు. రాయలసీమలో లిఫ్ట్ ఇరిగేషన్ ఆగిపోయిందని అబద్ధాలు చెప్పిన వైసీపీని తప్పుబట్టి, 18 నెలల్లోనే సీమలో 2,200 కోట్లతో పనులు చేపట్టి కుప్పం వరకు నీరు తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజల ఆనందాన్ని చెడగొట్టేందుకునే "మావిగన్" అనే కొత్త నాటకంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, జగన్‌కు వైసీపీలోనే మద్దతు లేదని, ప్రజలు ప్రశ్నిస్తే రాజకీయాల్లో ఉండలేరని హెచ్చరించారు. అమరావతి తెలుగు ప్రజల భవిష్యత్తు అని స్పష్టం చేసిన అచ్చెన్నాయుడు, అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చి అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

# రబీలో 23. 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

**- 5. 40 కోట్ల గోనెసంచులు, 17వేల లారీలు, 1241 మిల్లర్లు సిద్ధం**
**- 8 నుండి 24 గంటలలోగా రైతుల ఖాతాలకు నగదు జమ**
**- అభివృద్ధిలో ఏలూరు జిల్లాను రాష్ట్రంలో 5 నుండి 3వ స్థానానికి తీసుకువెళతాం**
**- 2026-27 బడ్జెట్లో జిల్లాలోని వివిధ శాఖలకు రూ.4028 కోట్ల కేటాయింపు-60 శాతం నిధులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి**
**- ప్రభుత్వ సేవలలో ప్రజల సంతృప్తిని దశలవారీగా నూరుశాతం సాదించాలి**
**పీఎన్ జి గ్యాస్ కూడా ఉచిత గ్యాస్ సబ్సిడీ అందిస్తాం**
**- రాష్ట్రవ్యాప్తంగా లక్ష పీఎన్ జి గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నది లక్ష్యం**
**- రాష్ట్ర పౌర సరఫరాలు, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్**



ఏలూరు, నేటి శుభోదయ ::: రానున్న రబీ సీజన్ లో రాష్ట్రంలో 23. 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించామని రాష్ట్ర పౌర సరఫరాలు, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో శనివారం జిల్లా సమీక్షా సమావేశం అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు అధికారులను సిద్ధం చేయడం జరిగిందని, ఇందుకోసం 5. 40 కోట్ల గొనె సంచులు, జిపిఎస్ కలిగిన 17 వేల లారీలు, 1241 మిల్లర్లను సిద్ధం చేశామన్నారు. ధాన్యం అందించిన రైతులకు 8 నుండి 24 గంటలలోపు నగదు వారి ఖాతాలలో జమచేస్తామన్నారు. గత ఖరీఫ్ లో రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో 51 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించామన్నారు. గత ప్రభుత్వ కాలంలో 2023 రబీలో 14 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారన్నారు. తమ ప్రభుత్వం 2025 రబీలో 19 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందన్నారు. రాష్ట్రంలోని ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవలలో ప్రజల సంతృప్తి స్థాయిని దశలవారీగా నూరుశాతం సాదించాలని, జూన్ నాటికి ప్రస్తుతం ఉన్న ప్రజల సంతృప్తి స్థాయిని అదనంగా కనీసం 10 శాతం మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశామన్నారు. రోడ్లు మరమ్మత్తులు, కొత్త రోడ్ల నిర్మాణం, సంక్షేమ వసతి గృహాలలో మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సిందిగా ఆదేశించామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసులు పెంచాలని, బస్టాండ్ లలో ప్రయాణీకులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించామన్నారు. జిల్లాలో రైతులు సాగు విస్తీర్ణాన్ని అనుసరించి వారికి అవసరమైన విత్తనాలు అందించాలని వ్యవసాయాధికారులకు ఆదేశాలు జరీ చేశామన్నారు. 2026-27 బడ్జెట్లో జిల్లాలోని వివిధ శాఖలకు రూ.4028 కోట్ల రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని , దీనిలో 60 శాతం నిధులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. జిల్లాలో ఈ సంవత్సరం 3.6 శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. ఉద్యానవనాలు సాగువిస్తీర్ణం పెంచడం, పారిశ్రామికాభివృద్ధితో ప్రస్తుత సంవత్సరం ఏలూరు జిల్లాను రాష్ట్రంలో 4వ స్థానంలో నిలుపుతామన్నారు. ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడా త్రాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నామని, కాలువలకు నీటిసరఫరాను ఈనెల 20వ తేదీ వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా వంట గ్యాస్ కు కొరత లేదని, ఎల్పీజీ బుకింగ్స్ కన్నా పంపిణీ ఎక్కువగా చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో రోజుకు సగటున 2 లక్షల గ్యాస్ బుకింగ్స్ నమోదైతే, మార్చ్,13,14 వతేదీలలో 5 లక్షలకు పైగా బుకింగ్స్ జరిగాయన్నారు. అయినప్పటికీ నిర్దేశించిన సమయానికే గ్యాస్ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పీఎన్ జి గ్యాస్ ప్రోత్సహిస్తున్నామని, ప్రస్తుతం రాష్ట్రంలో లక్ష పీఎన్ జి గ్యాస్ కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. పీఎన్ జి గ్యాస్ కు కూడా దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సబ్సిడీ 2900 రూపాయలు అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఏలూరు జిల్లాలో ప్రస్తుతం 9 వేల మంది పీఎన్ జి గ్యాస్ వినియోగదారులు ఉన్నారని, 13 వేల 415 అదనంగా కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాలకు ఎటువంటి వంట గ్యాస్ కొరత లేకుండా అందిస్తున్నామన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్క పేదవాడికి స్వంత ఇంటిని అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 10. 48 లక్షల మంది పేదలు స్వంత ఇంటికోసం దరఖాస్తు చేస్తుకున్నారని, వారిలో 6.50 లక్షల మందిని అర్హులుగా గుర్తించామన్నారు. వీరికి త్వరలోనే ఇళ్ళు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గాలలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ళ నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు సంబంధిత ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలన్నారు. సాస్కీ నిధుల ద్వారా పేదల ఇళ్ల కాలనీలలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆర్డిఎస్ఎస్ పథకం కింద కొత్తగా విద్యుత్ స్థంబాలు ఏర్పాటుచేసే సమయంలో, పాత మెటీరియల్ ని కూడా సద్వినియోగం చేసేలా విద్యుత్ సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పగలు సమయంలో స్ట్రీట్ లైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ళు కట్టేందుకు కొందమంది కాంట్రాక్టర్లు డబ్బులు తీసుకుని, నిర్మాణ పనులు పూర్తిచేయలేదని, అటువంటి వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇల్లు మంజూరై నిర్మాణానికి నిరాసక్తతతో ముందుకురాని లబ్దిదారులను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేసి, వాటిని రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలలో ఐవిఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నదని, ప్రజల సంతృప్తి స్థాయి మరింత మెరుగుపడేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు రూపొందించే సమయంలో స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలను కూడా అధికారులు పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, మద్దిపాటి వెంకటరాజు, చిర్రి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# డిసిల్టింగ్ పనులను పూర్తిస్థాయిలో చేయాలి

## : వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, ఏప్రిల్ 4 (నేటి శుభోదయ):- నగరంలో డిసిల్టింగ్ పనులను విస్తృతంగా చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా బాబు రాజేంద్రప్రసాద్ రోడ్డు వన్ టౌన్, కేటి రోడ్డు పంజా సెంటర్, కేఎల్ రావు ఔట్ఫాల్ డ్రైన్, హెచ్. బి. కాలనీ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డీసిల్టింగ్ పనులు విస్తృతంగా జరుగుతున్నాయని, చిన్న కాలువ దగ్గర నుండి మేజర్ అవుట్ఫాల్ డ్రైన్ల వరకు డీసిల్టింగ్ ఒక ప్రణాళిక బద్ధంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ పనులు వేసవికాలంలో చేయటం వల్ల ఒకవైపు దోమలను నియంత్రించటమే కాకుండా రానున్న వర్షాకాలంలో కూడా నీటి ప్రవాహంలో ఎటువంటి ఆటంకం లేకుండా రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. హెచ్ బి కాలనీ లోగల అన్న క్యాంటీన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్లు కచ్చితంగా ప్రతిరోజు పర్యవేక్షించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రతి చిన్న సమస్యను సత్వరమే పరిష్కరించాలని అన్నారు .ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్ర బోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజా దర్బార్ దోహదం

## : కె. నాగుల్ మీరా



విజయవాడ, ఏప్రిల్ 4 (నేటి శుభోదయ):- ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం దోహదపడుతుందని రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కె. నాగుల్ మీరా అన్నారు. 48వ డివిజన్ చిట్టినగర్ సొరంగం డౌన్ టీఎంహెచ్ స్కూల్ వద్ద విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని ఆదేశాలతో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కె నాగుల్ మీరా , టిడిపి నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమి అపూర్వ విజయం సాధించింది అన్నారు. అధికారంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, నాయకులతో పాటుగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలను వెనివెంటనే పరిష్కరిస్తున్నారన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని చిన్ని ఆదేశాలతో క్రమం తప్పకుండా ప్రజా దర్బార్ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి కి శాశ్విత గుర్తింపు రావడం రాజధాని ప్రాంతంలో ఉన్న విజయవాడ అభివృద్ధికి సైతం దోహదపడుతుందన్నారు. రాజధాని అమరావతికి ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అమరావతి శాశ్వత రాజధానిగా ఉండేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్లమెంటులో బిల్లు ఆమోదింప చేశారని, లోక్ సభ సభ్యునిగా కేశినేని శివనాద్ (చిన్ని ) ఇందుకోసం విశేష కృషి చేశారన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కామా దేవరాజ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కొట్టేటి హనుమంతరావు, నగరాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుకాసి కిరణ్ కుమార్, డివిజన్ టిడిపి అధ్యక్షులు బెవర జోగేశ్వరావు , డివిజన్ ప్రధాన కార్యదర్శి గోలవెల్లి నరసింహరావు, క్లస్టర్ ఇంచార్జి దీటి ప్రభుదాస్ , కరణం జగన్మోహనరావు మార్కెట్ యార్డ్ కమిటీ ఉపాధ్యక్షులు పాల మాధవ , మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు బంక నాగమణి ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పేరాబత్తుల రమణ , ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి రేగళ్ల లక్ష్మణరావు, పశ్చిమ నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు షేక్ నసీమ,తదితరులు పాల్గొన్నారు.

# నందిగామలో త్వరలోనే కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవనాలు


## : ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ, ఏప్రిల్ 4 (నేటి శుభోదయ):- నందిగామలో కేంద్రీయ విద్యాలయం కు శాశ్వత భవనాల నిర్మాణం సాధ్యమైనంత త్వరగా చేపడతామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని ) తెలిపారు. నందిగామలో కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న భవనాలను, శాశ్వత భవనాలు నిర్మాణం చేయనున్న రాఘవాపురంలోని ప్రాంతాన్ని స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య తో కలిసి శనివారం ఎంపీ కేశినేని చిన్ని పరిశీలించారు. తాత్కాలిక భవనాల ను పరిశీలించిన ఎంపీ చిన్ని ఆయా భవనాలలో సౌకర్యాలను ప్రిన్సిపల్ పంకజ్ ను అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులకు అడ్మిషన్లు వస్తాయో వివరాలు తెలుసుకున్నారు. ఫర్నిచర్, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాల వివరాలు అడిగారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యావకాశాలను మెరుగుపరిచేందుకు నందిగామలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభమైందన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటులో ఎమ్మెల్యే సౌమ్య కృషి, సహకారం ఉందన్నారు. నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం పార్లమెంటులో సైతం మాట్లాడడం జరిగిందన్నారు. ఇవేమీ తెలియని కొంతమంది అజ్ఞానులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. నందిగామ టిడిపి శ్రేణులు, ఎమ్మెల్యే సొంత నిధులతో తాత్కాలిక భవనాన్ని కేంద్రీయ విద్యాలయం కోసం ఏర్పాటు చేశారంటూ అభినందించారు. త్వరలోనే కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పోసిబాబు, కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి బాబు, నందిగామ రూరల్ పార్టీ మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిరుమామిళ్ల కృష్ణ, నందిగామ మండలం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు

# రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలతో రైతన్నలకు భరోసా

## : ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ, ఏప్రిల్ 4 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు ద్వారా రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కొటికలపూడి గ్రామంలో పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పబ్లిసిటీ పిచ్చితో పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో వేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రాజముద్రతో ఉన్న కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తోందన్నారు. తప్పులను సరిదిద్ది భూవివాదాలు లేకుండా చేయడమే తమ ప్రభుత్వ కర్తవ్యం అని వివరించారు. పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఒకప్పుడు రైతులే అధికారులు చుట్టూ తిరిగేవారు. పాస్ పుస్తకం వస్తే రైతులకు అదో వరం. ప్రజా ప్రతినిధులు సైతం ప్రభుత్వం వద్ద సంప్రదింపులు జరిపి పాస్ పుస్తకాలు మంజూరు చేసేలా గట్టి ప్రయత్నాలు చేసేవారు. అటువంటిది ఇప్పుడు అధికారులే పట్టాదారు పుస్తకాలు ఇస్తామంటూ రైతులు చుట్టూ తిరుగుతున్నారు. ఎక్కడున్నాసరే సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ కెవైసీ చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పారదర్శక పాలనకు ఇది నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని నిర్మాణ పనులపై క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష

## - సమీక్షకు హాజరైన మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేస్తోన్న సంస్థల ప్రతినిధులు



అమరావతి, నేటి శుభోదయ ::: ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో సాగుతోన్న రూ.57,821 కోట్ల విలవైన పనులను పూర్తి నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తూ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం అమరావతి లో గల సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ తో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన, రద్దు చేసిన పనులకు సంబంధించి ఉన్న వివాదాలు, సమస్యలు పరిష్కరించి పనులు చేపట్టిన సీఆర్డీఏ.నాటికి నేటికి నిర్మాణ వ్యయం పెరగడం సహా పలు సవాళ్లను అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులు అప్పగించిన సీఆర్డీఏ.ప్రస్తుతం రాజధానిలో పనులు చేస్తున్న 20 వేల మంది కార్మికులు, నిపుణులు.ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది. టార్గెట్ ను ఎంత మేరకు చేరుకున్నారనే విషయంలో పనుల వారీగా సీఎం సమీక్ష నిర్వహించారు. ఎంత మంది కార్మికులు పని చేయాలి, ఎంత మంది పనిచేస్తున్నారు. ఎంత మిషనరీ ఉపయోగించాలి, ఎంత ఉపయోగిస్తున్నారు అనే విషయంపై సమగ్ర చర్చ జరిగింది. వారం, నెల టార్గెట్ పెట్టుకుని పనులు పూర్తి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.వర్షాకాలం వచ్చే సమయానికి పూర్తి చేయాల్సిన పనులపై తాము పెట్టుకున్న లక్ష్యాలను వివరించిన అధికారులు.రాజధాని నిర్మాణమనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్ గా చూడొద్దు. ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములు వుతున్నట్టే. నిర్మాణ సంస్థలుగా మీరు ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు. కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు.రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి.అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి. కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి.రాజధాని ప్రతిష్టను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు.ప్రభుత్వం నిర్ధేసించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు.మ్యాన్ పవర్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలి అని తెలిపారు.

# కృష్ణా జిల్లా కలెక్టర్ గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న డీకే బాలాజికి అభినందనలు

## కలెక్టరేట్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు



మచిలీపట్నం, ఏప్రిల్ 4( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) :కృష్ణా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకు కలెక్టరేట్ ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఉద్యోగులు కేక్ కట్ చేసి, కలెక్టర్‌ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా పరిపాలనలో సమర్థవంతమైన నాయకత్వం, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం, ప్రభుత్వ పథకాల అమలులో కట్టుదిట్టమైన పర్యవేక్షణతో జిల్లా అభివృద్ధికి జిల్లా కలెక్టర్ విశేషంగా కృషి చేస్తున్నారని ఉద్యోగులు ఈ సందర్భంగా అభినందించారు. జిల్లాలో ప్రజా సేవ, పరిపాలనా పారదర్శకత, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లా కలెక్టర్ చూపుతున్న అంకితభావం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, బందరు ఆర్డీవో కే సాంబశివరావు, కలెక్టరేట్ ఏవో రాధిక, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఎం పార్టీ నాయకుల పత్రిక ప్రకటనను ఖండిస్తున్నాం

## టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు జహంగీర్.



చింతూరు డివిజన్ నేటి శుభోదయ:అమరావతి రాజధాని చట్టబద్ధత కల్పించినందుకు మా తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ బిజెపి పార్టీ కలిపి తెలుగుదేశం పార్టీ ఆఫీసులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ గార్లకు పూల మాలలు వేసి సత్కరించి నాయకులు కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి టపాసులు కాల్చుకొని పండగ వాతావరణం లో కార్యక్రమం నిర్వహించారు. అదే సందర్భంగా చింతూరు ఐటిడిఏ ఆఫీసు వద్ద అధికారులు కూడా కొవ్వొత్తులతో అమరావతి చట్టబద్ధతకు స్వాగతించడం జరిగింది. పి ఓ గారు గాని మండల అధికారులు గానీ కూటమి నాయకులకు ఎటువంటి ఆహ్వానాలు పంపించలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు ఇచ్చిన వంటి కార్యక్రమాన్ని ఉద్యోగాలు అధికారులు నిర్వర్తించారు. అదే సందర్భంగా అధికారులు చింతూరు సెంటర్లో అమరవీరుల స్థూపాల వద్ద పండుగ వాతావరణం లో కొవ్వొత్తులు వెలిగించి అమరావతిని స్వాగతించే సందర్భంలో మేము కూడా ఒక భారతదేశంలో పౌరులుగా అక్కడ కార్యక్రమాలకి హాజరవటం జరిగింది తప్ప కూటమి జండాలు గాని నాయకుల పేర్లు గాని అక్కడ ప్రస్తావించలేదు అనేది మీరు గమనించాలి ప్రెస్ మీట్ ఇచ్చే సందర్భంగా అక్కడ జరిగిన కార్యక్రమాలు అక్కడ జరిగినటువంటి సందర్భాలు తప్పుగా ఉంటే ఇవ్వాలి తప్ప ఇలాంటి పత్రిక ప్రకటనలు హాస్యాస్పదశీ పత్రిక ప్రకటనలు ఇవ్వటం సరికాదని తెలుగుదేశం పార్టీ ఖండిస్తున్నాం. మండలంలో అనేక సమస్యలు ఉన్నాయి అని అన్నారు కానీ ఈ రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వంలో అనేకమైన సంక్షేమ పథకాలు పోలవరం ప్యాకేజీలు రాష్ట్రంలో రోడ్లు అభివృద్ధి. అమరావతి రాజధాని. వాటి మీద స్వాగతించాలని. ఉండదు గానీ ఇలాంటి తప్పుడు ప్రకటనల తో రాజకీయ మనుగడ సాధించుకోవాలి అని అధికారులను గందరగోళంలో పడేసే విధంగా వ్యవహార శైలి సరైనది కాదని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా. ఖండిస్తున్నాం కాబట్టి మీ వల్ల పార్టీలు గానీ మీ వల్ల అధికారులు కానీ నేర్చుకునే పరిస్థితి ఉండదు గమనించారని కోరుతున్నాం ఒకే రాష్ట్రం ఒకే రాజధాని జై అమరావతి దేశంలోనే 49 రాజకీయా పార్టీలు మద్దతు తెలిపిన ఏకైక రాజధాని అమరావతి జై అమరావతి.

# ఎస్సై సంతోష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన దళిత సంఘ నాయకులు



చింతూరు డివిజన్ నేటి శుభోదయ:పోలవరం జిల్లా చింతూరు మండలం నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై సంతోష్ ని చింతూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దళిత కుటుంబ సంక్షేమ సంఘం నాయకులు శనివారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు నాగేంద్ర, కుమార్ లు సమాజంలో దళితులపై జరుగుతున్న దాడులను, అరాచకాలను అరికట్టాలని ఎస్సైని కోరడం జరిగింది.అనంతరం ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు ఎవరు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం నాయకులు లాడే శ్రీనివాసరావు, నక్కా విజయరత్నం, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ' పోలవరం ప్రాజెక్టుకు రూ. 1, 301 కోట్ల అడ్వాన్స్ నిధులు అభివృద్ధికి కేంద్రం మరింత వేగం.! '

## - బిజెపి సీనియర్ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి..




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.)దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి ప్రధాని భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూ. 1,301 కోట్ల అడ్వాన్స్ నిధులను విడుదల చేసిందని, ఇది ఎంతో శుభపరిణామం అని రాజానగరం నియోజకవర్గం బీజేపీ మాజీ ఇంచార్జి నీరుకొండ వీరన్న చౌదరి వెల్లడించారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఒక ప్రకటన చేశారు. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటివరకు మొత్తం రూ. 2,809 కోట్ల నిధులు విడుదల చేయడం విశేషమని పేర్కొన్నారు. మరింత పారదర్శకత కోసం 'స్పర్శ్' (ఞూూ=ూఞ) విధానాన్ని అమలు చేస్తూ పనులు పూర్తయ్యిన వెంటనే నేరుగా నిధులు విడుదల చేసే సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఇక మరోవైపు, అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించడం రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేస్తోందన్నారు. ఈ నిర్ణయాలన్నీ కలిసి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీ నాయకత్వంలో మన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగుతోందని స్పష్టంగా తెలియజేస్తున్నాయని వీరన్న చౌదరి హర్షం వ్యక్తం చేశారు.

# రాజానగరం మండలం సూర్యారావు పేట తూర్పు గోనగూడెం గ్రామశీలో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు..



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం సూర్యారావు పేట తూర్పు గోనగూడెం గ్రామలలో గుడ్ ఫ్రైడే వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. సమస్త జనుల కోసం యేసుక్రీస్తు చేసిన ప్రాణత్యాగాన్ని స్మరిస్తూ పెంతెకోస్తు దైవారాధన మందిరం వ్యవస్థాపకులు దైవజనులు గెద్దం యేసురత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా దైవజనులు యేసురత్నం మాట్లాడుతూ యేసు క్రీస్తు ఈ లోకంలో మనిషిగా జన్మించి అనేకమైన అద్భుత కార్యక్రమాలు చేసి ప్రజలతో అనేక మన్ననలు,శ్రమలను అనుభవించి చివరకు యేసు క్రీస్తు ఈ లోక మానవాళి పాప పరిహారం కోసం



సిలువపై తన ప్రాణత్యాగం చేసిన గొప్ప దైవం యేసుక్రీస్తు అని తెలియజేశారు.తనను లోకంలో ఉన్న ప్రజలు ఎన్ని శ్రమలు పెట్టిన కానీ ప్రజలకు ప్రేమ,కరుణ, క్షమాపణ,త్యాగం గుణాలను ఆయన చూపించారు.అదేవిధంగా క్రీస్తు చూపిన ప్రేమ,కరుణ, త్యాగం,క్షమాపణ గుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. అనంతరం క్రైస్తవ సహోదరి, సహోదరులకు గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేస్తూ,యేసు క్రీస్తు దీవెనలు ప్రజలందరి పై ఎల్లప్పుడూ ఉంది అని తెలియ చెప్పారు.యేసుక్రీస్తును గోల్గోతా కొండపై శిలువ వేసిన సమయంలో యేసు సిలువలో పలికిన ఏడు మాటలను ఏడుగురు సహోదరులు వివరించారు.ఈ కార్యక్రమంలో దైవారాధన మందిర దైవజనులు జి. సుధాకర్ పాల్,జి.జోసెఫ్ ఫ్రాన్సిస్, జి.సుగుణ,జి.సునీత పాల్,జి.జోయిస్ ఫ్రాన్సిస్ లు,క్రైస్తవ సహోదరి, సహోదరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి ఆపన్న హస్తం అందించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు, ఏప్రిల్ 4 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) సివిల్స్ చదువుకోవాలనే కోరిక, చదువుకోవడానికి స్థోమతలేక ఎదురుచూసే అతనికి నేనున్నాను అని భరోసా ఇచ్చి చదువుకు డబ్బు అందించిన ఘనత ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దే నని పలువురు అభినందించారు. పెనమలూరు మండలం గోసాల గ్రామానికి చెందిన రామిశెట్టి సాయి సరోజ, విట్ కాలేజీలో డిగ్రీ బి. బి. ఎ. 2వ సంవత్సరము చదువుతుండగా అకస్మాత్తుగా తల్లిదండ్రులను కోల్పోవడంతో, ఆమె విద్య మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది.ఈ విషయము ఎమెల్యే బోడే ప్రసాద్ దృష్టికి రాగానే, వారు వెంటనే స్పందించి, పెనమలూరు మండల తహసీల్దార్ మరియు బోడే దళం సభ్యుల సహకారంతో రు.1,85,000 రూపాయలను డిమాండ్ డ్రాఫ్ట్‌ల రూపంలో ఆ విద్యార్థికి అందజేశారు.ఐ. ఎ. ఎస్ అవ్వాలన్న తన కల మధ్యలోనే ఆగిపోకుండా, తనకు అండగా నిలిచిన బోడే ప్రసాద్ ఆ విద్యార్థి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనలాగా మెరిట్ విద్యార్థులు పేదరికం కారణంగా చదువుకోలేక పోతున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ లాంటి మంచి మనసున్న మనుషులు ఆదుకుని ప్రోత్సహించాలని కోరుకుంటున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో మారుపూడి ధన కోటేశ్వరరావు, కోయ ఆనంద ప్రసాద్, సంగీపు రంగారావు, మాబు సుభాని ఎందువ రాంబాబు అబ్రహాము పాల్గొన్నారు.

# 'వైస్సార్ యువజన విభాగం రీజనల్ మాజీ కోఆర్డినేటర్, యువనేత జక్కంపూడి గణేష్ సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం

## - రాజానగరం మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు

## - వైసీపీ యువ నాయకుడు ఉల్లి గణ ఆర్థిక సాయంతో కూలింగ్ వాటర్ ప్యూరిఫై, 15 కుర్చీలు కోరుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి అందజేత...




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ మాజీ కోఆర్డినే టర్, యువనేత జక్కంపూడి గణేష్ ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన స్ఫూర్తిదాయకమైన వ్యక్తి రాజానగరం మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు పేర్కొన్నారు. కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం యువనేత గణేష్ పుట్టినరోజు వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నేత ఉల్లి గణ నాధరావు ఆర్థిక సాయంతో సమకూర్చిన కూలింగ్ వాటర్ ప్యూరిఫై, 15 కుర్చీలను నాయకులు చేతుల మీదుగా ఆసుపత్రికి అందజేశారు. అనంతరం సీనియర్ నాయకులు నక్కా రాంబాబు మాట్లాడుతూ.... ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ఆదుకునే వ్యక్తి జక్కంపూడి గణేష్ అని పేర్కొ న్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి తాడి హరిచంద్ర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... యువకులు గణేష్ పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కంటే సేవా కార్యక్రమాలకు ఆ సొమ్ములు వినియోగిస్తే బాగుంటుందని సూచించారు. సీనియర్ నాయకులు ఉల్లి బుజ్జి బాబు, నాగా సత్తిబాబు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కే శ్రీనివాస్, కోరుకొండ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, అడపా సురేష్, కేతినీడి అశోక్, నేతుల చిన్ని, సత్య ప్రసాద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవాలి

- కేరళ సిఎం పినరయ్ విజయన్




తిరువనంతపురం : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరుగుతున్న ఎల్‌డిఎఫ్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవాలని, సత్యాన్ని ప్రచారం చేయాలని శనివారం కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ మద్దతుదారులను కోరారు. ఎన్నికల సందర్భంగా ఓటర్లతో మమేకమవ్వడం తనకు పరిమితులున్నాయని విజయన్ అన్నారు. కేరళ అభివృద్ధిలో ఓ పెద్ద ముందడుగు వేయగల దశకు చేరుకుందని ఆయన అన్నారు. పరిపాలనా పరిమితులు, నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోయినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయనకు బదులు తన మద్దతుదారులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నందుకు వారిని ఆయన ప్రశంసించారు. శనివారం కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ధర్మదాం నియోజకవర్గంలోని కన్నూర్ పొదువాచేరిలో జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కేరళ అభివృద్ధిలో పెద్ద ముందడుగు వేయగల దశకు చేరుకుంది. ప్రతి రాష్ట్రం సాధారణ అభివృద్ధితోపాటు ముందుకు సాగగలగాలి. అభ్యర్థిగా నాకు కొన్ని పరిమితులు ఎదురయ్యాయి. నేను ఎక్కువమంది ఓటర్లతో సంభాషించలేకపోయాను. నేను ఇతర నియోజకవర్గాలకు కూడా వెళ్లి ఉండాల్సింది. కానీ ప్రచారంలో పాల్గొనలేకపోయాను. ఆ విషయాన్ని మీరు అర్థం చేసుకున్నారు. దానిని మీరు ఒక పరిమితిగా భావించకుండా ఆ బాధ్యతను స్వీకరించి ప్రచారం చేశారు. ఈ సమయంలో తప్పుడు ప్రచారం వ్యాప్తి చెందుతుంది. ప్రజలకు అసలు నిజాలు తెలియజేయడంపైనే దృష్టి పెట్టాలి అని విజయన్ కోరారు.

## బిజెపి హింసను రెచ్చగొట్టాలని చూస్తోంది : మమతా బెనర్జీ



కోల్‌కతా : ఎన్నికల సందర్భంగా పశ్చిమబెంగాల్‌లో బిజెపి హింసను రెచ్చగొట్టాలని చూస్తోందని ఆరాష్ట్ర సిఎం మమతాబెనర్జీ వ్యాఖ్యానించారు. నేడు ఆమె మల్దాలోని మణిక్‌చక్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిజెపి చేసే ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకు లొంగిపోవద్దని ప్రజలను కోరారు. బిజెపి హింసను రెచ్చగొట్టాలని చూస్తోంది. మాల్దాలోని మోతాబరిలో చేసినట్లుగానే ప్రజలను టార్గెట్ చేసుకోవడానికి కేంద్ర సంస్థల్ని ఉపయోగిస్తోంది అని మమతా అన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఇవిఎంలు, వీవీప్యాట్ యంత్రాలను కాపాడుకోవాలని ఆమె మహిళలను కోరారు. ఇక మాల్దా ఘెరావ్ ఘనటపైనా ఆమె మాట్లాడారు. 'రెండు మతతత్వ పార్టీలు న్యాయమూర్తులను ఘెరావ్ చేసి పారిపోయాయి. ఇప్పుడు ఎన్‌ఐఎ స్థానిక యువతను వేధిస్తోంది' అని మమతా అన్నారు. ఈ సందర్భంగా మాల్దాలో సమావేశం నిర్వహించి, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన ప్రజలతో మాట్లాడాలని అమిత్‌షాకు ఆమె సవాల్ విసిరారు.

## 28 జిల్లాలతో ఏపి కొత్త మ్యాప్ ..!




అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 28 కి పెరిగింది. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర పటంలో మార్పులు చేసిన ప్రభుత్వం, రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు 28 జిల్లాలతో కూడిన నూతన మ్యాప్‌ను ఏపి విపత్తు నిర్వహణ సంస్థ అధికారికంగా విడుదల చేసింది. ఈ మ్యాప్‌లో రాష్ట్ర రాజధానిగా అమరావతిని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతాలను వేరు చేస్తూ మార్కాపురం కేంద్రంగా ఒక జిల్లాను, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలతో పోలవరం కేంద్రంగా మరో జిల్లాను ఏర్పాటు చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివఅద్ధి, పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు, అభివఅద్ధిని వికేంద్రీకరించే లక్ష్యంతోనే ఈ పునర్విభజన చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది. గతంలో 13 జిల్లాలుగా ఉన్న ఏపి, వైఎస్ జగన్ హయాంలో 26 జిల్లాలుగా మారింది. తాజాగా ఈ సంఖ్య 28 కి చేరింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని విషయంలో కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ, అధికారిక మ్యాప్‌లో అమరావతిని రాజధానిగా చేర్చడం ఈ ప్రకటనలో కీలక పరిణామం.

## అమెరికా - ఇజ్రాయిల్ ఇరాన్ అణు విద్యుత్ కేంద్రంపై దాడి



టెహ్రాన్ : అమెరికా - ఇజ్రాయిల్ ఇరాన్‌పై క్షిపణి దాడికి పాల్పడింది. శనివారం దక్షిణ ఇరాన్‌లోని బుషెహర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో అమెరికా - ఇజ్రాయిల్ క్షిపణి దాడికి పాల్పడింది. ఈ దాడి ఘటనలో ఒక భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ వెల్లడించింది. ఈ దాడి వల్ల ప్లాంట్‌లోని ప్రధాన భాగాలకు నష్టం జరగలేదు. కానీ ఈ ప్లాంట్ సహాయ భవనం దెబ్బతింది అని మీడియా వెల్లడించింది. ఈ దాడికి ముందు ఇరాన్‌లోని నైరుతి ఖుజెస్తాన్ ప్రావిన్స్‌లోని మఎ?షహర్ పెట్రో కెమికల్ జోన్లపై అమెరికా -- ఇజ్రాయిల్‌లు వైమానిక దాడికి చేయగా.. ఐదుగురు గాయలపాలయ్యారు.

# సూపర్ 'పవర్‌గేమ్'లో భారత్ డైలమా!



డామిట్, కథ అడ్డం తిరిగింది. ట్రంపూ, నెతన్యాహూ కలిసి రాసుకున్న స్క్రిప్టులో లేని సన్నివేశం ఎదురైంది. ఈ యాంటీ క్లైమాక్స్ వాళ్లు ఊహించింది కాకపోవచ్చు. వ్యూహం ప్రకారమే దాడులు జరిగిన తొలిరోజున ఇరాన్ ఆధ్యాత్మిక అధినేత అలీ ఖమేనీని హతం చేశారు. ఈ దెబ్బకు ఇరాన్ జావకారిపోయి ఉండాలి. మత పాలనను వ్యతిరేకించే ఇరాన్ ప్రజలు లక్షల సంఖ్యలో వీధుల్లోకి వచ్చి ట్రంపు మహాశయునికి జైకొట్టి ఉండాలి. మహా అయితే నాలుగు రోజుల్లో ఇరాన్ సర్కార్‌ను పీక పట్టుకొని మోకాళ్ల మీద కూర్చోబెట్టి అవమానకరమైన షరతుల మీద సంతకం పెట్టించి ఉండాలి. ఇదీ వ్యూహం. నాలుగు రోజులు కాదు. నాలుగు వారాలు గడిచిపోయాయి. ఏమైంది? హార్మూజ్ అనే ఒక సముద్రపు ఇరుకు సందులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పీకను దొరకబుచ్చుకొని దాని కణత మీద తుపాకీ గురిపెట్టి కూర్చున్న ఇరాన్ దృశ్యం ఇప్పుడు స్పష్టంగా కనిపి స్తున్నది. నాలుగున్నర దశాబ్దాలుగా ఇరాన్ మీద ఆర్థిక ఆంక్ష లను అమెరికా అమలు చేస్తున్నది. దాని చమురు అమ్మకాలను నిషేధించింది. తాజా పరిణామాలతో, చమురు నౌకల రవా ణాకు ఆటంకాలను తొలగించాలని విజ్ఞప్తి చేయడంతోపాటు ఇరాన్ కూడా అమ్ముకోవచ్చంటూ తాత్కాలిక 'అనుమతి'ని ప్రసాదించింది. ఇదేమీ ట్రంప్ 'కరుణ' కాదు, కాళ్ల బేరమని అర్థమవుతూనే ఉన్నది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభంపై ప్రపంచ దేశాలు తనను వేలెత్తి చూపకుండా ఓ నెలరోజుల సడలింపును ఆయన ప్రకటించారు. గతంలో చాటుమాటుగా చైనాకు చమురు సరఫరా చేసి, దాన్నుంచి వస్తు--సేవలను పొందుతున్న ఇరాన్ ఇప్పుడు రైట్ రాయల్‌గా రోజుకు 140 మిలియన్ డాలర్ల విలువైన చమురు అమ్మకాలను ప్రారంభించింది. దాడుల్లో ఇరాన్‌కు జరిగిన ఆస్తి నష్టంపై స్పష్టమైన అంచనాలు ఇంకా రాలేదు గానీ, చమురు విక్రయం ద్వారా బహిరంగంగా రోజుకు సుమారు 1400 కోట్ల రూపాయలను (ఇండియన్ కరెన్సీలో) ఇరాన్ ఆర్జిస్తున్నది. అమె రికా మాత్రం చేతి చమురును బాగానే వదిలించుకుంటున్నదని ఆ దేశంలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకు రోజుకు సగటున ఒకటిన్నర బిలియన్ డాలర్ల చొప్పున యుద్ధ జ్వాలలకు అమెరికా ఆహుతిస్తున్నదని లెక్కలు తేలుతున్నాయి. మొదటి మూడు వారాల్లో 30 బిలియన్ డాలర్లను అర్పించు కోవలసి వచ్చింది. ఇరాన్ దాడుల్లో గల్ఫ్ ప్రాంతంలోని అమె రికా సైనిక స్థావరాలు భారీగా ధ్వంసమయ్యాయి. వాటి పున రుద్ధరణ పేరుతో ఇంకో 200 బిలియన్ డాలర్లను కేటాయించాలని అమెరికా కాంగ్రెస్‌ను పెంటగన్ (రక్షణ శాఖ కేంద్రం) కోరుతున్నది. పెంటగన్ అభ్యర్థనపై ప్రతిపక్ష డెమోక్రాట్లే కాదు, కొందరు పాలక రిపబ్లికన్లు కూడా దుమ్మెత్తిపోస్తున్నారు. అమెరికా ప్రజల జీవన ప్రమాణాలను పణంగా పెట్టి ఏం సాధించాలని ఇరాన్ యుద్ధంలో ఇంత పెద్దమొత్తంలో తగలేస్తున్నారని వారు ట్రంప్ సర్కార్‌ను నిగ్గదీస్తున్నారు. ఇప్పటికే 39 ట్రిలియన్ డాలర్ల అప్పులతో సతమతమవుతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఈ నిరర్థక యుద్ధ ఖర్చు మోయలేని భారాన్ని మోపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌పై హఠాత్తుగా ఇజ్రాయె ల్‌తో కలిసి దాడులకు తెగబడటానికి స్పష్టమైన కారణాన్ని కూడా ట్రంప్ ప్రభుత్వం చెప్పలేకపోయింది. అణ్వస్త్ర బూచీ అనే అరిగిపోయిన రికార్డునే అది ఇప్పటికీ ప్లే చేస్తున్నది. ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమం ఆరోపణలపై ఇప్పటికే అంత ర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (ఏఐఈఏ) అక్కడ తనిఖీలు చేసింది. అణ్వాయుధాలను తయారుచేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తున్న దనేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రాసీ స్పష్టంగా ప్రకటించారు. అయినప్పటికీ అమెరికాకు, ఇజ్రాయెల్‌కు మాత్రం ఇరాన్ అణుబూచీ కనిపి స్తూనే ఉన్నది. ఇరాన్‌ను నిర్వీర్యం చేస్తే పశ్చిమాసియాలో పెత్తనం చేసే అవకాశం ఇజ్రాయెల్‌కు లభిస్తుంది. ఇరాన్ దన్నుతో ఆ ప్రాంతంలో ప్రమాదకరంగా తయారైన టెర్రరిస్టు గ్రూపులు హెజ్బుల్లా (లెబనాన్), హూతీ (యెమెన్), హమాస్ (పాలస్తీనా)లు కూడా తోక ముడుస్తాయి. ఇదీ ఇజ్రాయెల్ ఆలోచన.

మరి అమెరికాకు ఒనగూడే ప్రయోజనం ఏమిటి? 1979లో జరిగిన ఇస్లామిక్ రివల్యూషన్‌లో పదవీ చ్యుతుడైన రాజు రెజా పహ్లవీ. ఆయన అమెరికా కీలుబొమ్మ. ఆ కాలంలో ఇరాన్ నుంచి కారుచౌకగా అమెరికా చమురు కొనుగోలు చేసేది. ఇప్పుడింకో కీలుబొమ్మను కూర్చోబెడితే మళ్లీ ఆ అవకాశం ఉండొచ్చు. కానీ, యుద్ధానికి అదేమంత పెద్ద కారణం కాదు. అమెరికా ఇంధన భద్రతకు అంత ప్రమాదమేమీ లేదు. పైగా ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న వెను జువేలా దేశం అమెరికాకు కూతవేటు దూరంలోనే ఉన్నది. దాని అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణిని కిడ్నాప్ చేసి ఆ దేశాన్ని అమెరికా తన చెప్పుచేతుల్లోకి తీసుకున్నది. వెనుజువేలా కూడా ఇరాన్‌లాగే చైనాకు మిత్రదేశం కావడం ఇక్కడ గమనార్హం. భారత్ లాగే చైనా కూడా ఇంధన భద్రత గల దేశం కాదు. పైగా దాని ఇంధనావసరాలు చాలా ఎక్కువ. వెనుజువేలా, ఇరాన్ దేశాలు అమెరికా ఆంక్షల నేపథ్యంలో మలేసియా, రష్యా వంటి దేశాల ద్వారా క్రూడ్ ఆయిల్‌ను శుద్ధి చేసి చైనాకు పంపి స్తాయి. చైనాకు ప్రధాన చమురు సరఫరాదారైన రష్యా కూడా అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్నదే కావడం విశేషం. ప్రపంచ చమురు రవాణాలో ఇరవై శాతానికి పైగా సాగే హార్మూజ్ జలసంధిని యుద్ధ నేపథ్యంలో ఇరాన్ తన పూర్తి నియంత్రణలోకి తీసుకున్నది. అక్కడి నుంచి చమురు రవాణా చేసే నౌకలపై టోల్ ఫీజు వసూలు చేయాలని ఆలోచిస్తున్నట్టు ఒక లీక్‌ను ఇరాన్ వదిలింది. అంతేకాదు, ఆ ఫీజు అమెరికా డాలర్లలో కాకుండా చైనా యువాన్‌లలో వసూలు చేయాలని ఆలోచిస్తున్నట్టు కూడా వార్తలు వచ్చాయి. ఈ వార్తలు వచ్చిన మరుసటి రోజే ట్రంప్ ఐదు రోజుల దాడుల విరామాన్ని ప్రకటించాడు. దాన్ని తర్వాత ఏప్రిల్ 6 దాకా పొడిగించాడు. ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగలేదు. డాలర్‌కు సవాల్ ఎదురైతే అమెరికా తట్టుకోలేదు. అందు లోనూ డాలర్ ఆధిపత్యానికి ఊపిరిపోసిన చమురు రంగంలో పోటీ ఎదురైతే చేటుకాలం దాపురించినట్టే. యాభయ్యేళ్ల కింద చమురు ఎగుమతి చేసే గల్ఫ్ దేశాల రక్షణ బాధ్యతను అమెరికా తీసుకున్నది. ప్రతిగా చమురు కొనుగోలు చేసే దేశాలు అందుకు చెల్లించాల్సిన సొమ్మును అమెరికా డాలర్లలో చెల్లించాలి. ఇంధన అవసరాలు అన్ని దేశాలకూ ఉంటాయి కనుక డాలర్ డిమాండ్ పెరిగింది. ఇప్పుడు ఇరాన్ యుద్ధం నుంచి వెనక్కు తగ్గి అమె రికా తోక ముడిస్తే, ఇరాన్ దాడుల్లో తీవ్రంగా నష్టపోతున్న అరబ్ దేశాల రక్షణ బాధ్యత నుంచి అమెరికా వైదొలగి నట్టవుతుంది. అప్పుడు చమురు అమ్మకాన్ని డాలర్లలోనే కొనసాగించవలసిన అవసరం ఈ దేశాలకు ఉండదు. యువాన్, రూబుల్, యెన్ దేన్నయినా వాళ్లు అంగీకరించే అవకాశం ఉంటుంది. ఇటువంటి పరిణామం సంభవిస్తే అమెరికా శిరస్సు మీద నుంచి అగ్రరాజ్యం అనే కిరీటం ఊడి కిందపడ్డట్టే! విరామం తాత్కాలికమే. ఇరాన్ పూర్తిగా లొంగిపోయి, తమ అనుకూల ప్రభుత్వాన్ని అక్కడ ప్రతిష్ఠించే దాకా దాడులు చేయాలని అమెరికా తొలుత భావించింది. అలా జరగాలంటే ఇరాన్ గడ్డమీద తన సేనలను దించాల్సి ఉంటుంది. ఇరాన్ భౌగోళిక స్వరూపం దృష్ట్యా దాంతో భూతల యుద్ధం సాధ్యం కాదని రక్షణ నిపుణులు చెబుతారు. ఉత్తర దక్షిణ సరిహద్దుల్లో సహజమైన కోట గోడగా ఉన్న పర్వత శ్రేణులే ఇందుకు కారణం. మధ్యేమార్గంగా ఇరాన్ చమురు నిల్వచేసే ఖార్గ్ దీవినో, పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న దీవుల్లో మరోదాన్నో ఆక్రమించాలని అమెరికా భావిస్తున్నది. ఆ దీవి ద్వారా హార్మూజ్ నుంచి చమురు కంటెయినర్లు సజావుగా వెళ్లేలా పర్యవేక్షించి యుద్ధంలో విజయం సాధించినట్లు ప్రకటించుకోవాలని భావిస్తున్నది. పర్షియన్ గల్ఫ్ దీవుల ఆక్రమణ కూడా అమెరికా -- ఇజ్రాయెల్ ఊహిస్తున్నంత సులభం కాదు. ఇరాన్ నుంచి తీవ్రమైన ప్రతిఘటననే ఎదుర్కోవలసి ఉంటుంది. నాలుగు వేల కిలోమీటర్ల దూరంలోని డిగో గార్షియా దీవులపైకే క్షిపణులను ప్రయోగించిన ఇరాన్ పట్టుమని పది కిలోమీటర్ల దూరం లేని దీవుల్లో అమెరికా సైన్యం దిగితే మిన్నకుంటుందా? పర్షియల్ గల్ఫ్‌లో పెనుమంటలు చెలరేగవచ్చు. దుబాయ్, అబుధాబీ, దోహా, రియాద్ నగరాల వైభవోజ్వల కాంతులు మసక బారవచ్చు. అన్నిటినీ మించి ప్రపంచ ఆర్థిక గమనం తీవ్రమైన ఒడిదుడుకులకు లోనుకావచ్చు. మన దేశం సంగతి సరేసరి. ఇరాన్ మన దేశం పట్ల కొంత ఉదారంగా ఉన్నప్పటికీ నాలుగు వారాల ఘర్షణే దేశంలో తీవ్రమైన ప్రభావాన్ని చూపెడుతున్నది. ఈ ఘర్షణ వారాల్లోంచి నెలల్లోకి మారితే తీవ్ర సంక్షో భాన్ని చవిచూడవలసి రావచ్చు. మన రాజకీయ నాయకత్వ దీక్షా దక్షతలకు, ప్రజా సమూహాల సమైక్యతకు ఇది పరీక్షా కాలం. ప్రపంచాన్ని ఆందోళనకరమైన పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్న ఈ అంతర్జాతీయ పరిణామాల్లో ఒక ప్రముఖ దేశంగా, అత్యధిక జనాభా గల దేశంగా ఉన్న భారత్ పోషించవలసిన పాత్ర ఏమిటన్నది కూడా చర్చించుకోవలసిన సందర్భం. తన సూపర్ పవర్ హోదాను, తన ఆధిపత్యంలోని ఏకధ్రువ ప్రపంచ గమనాన్ని నిలబెట్టుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నది. ఆర్థికంగా -- సాంకేతిక పరంగా అనూహ్యమైన ప్రగతిని సాధించిన చైనా ఈ తరహా ప్రపంచ గమనపు దిశను మార్చాలని సహజంగానే భావిస్తుంది.

### బెంగాల్ ప్రజలకు మీరంటే ఇష్టం లేదు!

### అమిత్ షా ప్రకటనపై సీఎం మమత ఎద్దేవా

### మాల్దా ఘటన ఎంఐఎం కుట్ర అంటూ ఆరోపణ

# 365 రోజులున్నా ఫలితం శూన్యం



గజోల్: అసెంబ్లీ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్‌లో 15 రోజులుపాటు ఉంటానంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనపై సీఎం మమతా బెనర్జీ తనదైన శైలిలో స్పందించారు. 'అమిత్ షా అన్నా, బీజేపీ అన్నా బెంగాల్ ప్రజలకు గిట్టదు. అందుకే అమిత్ షా ఇక్కడ 15 రోజులు కాదు..ఏకంగా 365 రోజులపాటు మకాం వేసినా ఎలాంటి ఫలితమూ ఉండదు'అంటూ వ్యాఖ్యానించారు. శుక్రవారం మాల్దా జిల్లా గజోల్‌లో ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. మాల్దాలో సర్ దరఖాస్తుల పరిశీలనకు వెళ్లిన న్యాయాధికారులను 8 గంటలపాటు నిర్బంధంలో ఉంచిన ఘటనపై మమత స్పందిస్తూ.. బీజేపీ హైదరాబాద్ కోకిల ఈ కుట్రకు పథకం వేసిందంటూ పరోక్షంగా ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. ఇటీవల టీఎంసీ నుంచి వేరుపడి ఆమ్ జనతా ఉన్నయన్ పేరుతో పార్టీ పెట్టిన హుమాయూన్ కబీర్‌కు మద్దతు ప్రకటించిన ఎంఐఎం చీఫ్ ముస్లింల ఓట్లు చీల్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన ఎంఐఎం, ఐఎస్ఎఫ్ కార్యకర్తలకు మాల్దా ఘటనలో ప్రమేయం ఉందన్నారు. ఇందులో కాంగ్రెస్ హస్తం కూడా ఉందని చెప్పారు. 'మాల్దా ఘటన బెంగాల్ పరువును మంటగలిపింది. ఈ ఘటనకు కారణం స్థానికులు కారు. వాళ్లకు ఇబ్బందులు ఉండే ఉండొచ్చు. బయటి వ్యక్తులే వారిని ఈ ఉచ్చులోకి లాగారు. హైదరాబాద్ నుంచి తమ మతానికి చెందిన కొందరిని వెంటేసుకు వచ్చిన ఒక బీజేపీ కోయిల దీని వెనుక ఉంది. పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న వారిని ఎయిర్‌పోర్టులో మా సీఐడీ బృందం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది'అని మమత తెలిపారు. 'బెంగాల్ అంటే ఢిల్లీ మాదిరిగా కాదు. వివిధ ప్రభుత్వ సంస్థలను వాడుకుంటూ, ఓటర్లకు డబ్బు ఎరవేసి ఏదైనా చేయొచ్చని అనుకుంటే కుదరదు'అని స్పష్టం చేశారు. బీజేపీ ఓటమి ఖాయమని తనకు తెలుసునన్నారు. రాష్ట్రంలోని పోలీస్ యంత్రాంగం ఇప్పటికీ తన నియంత్రణలోనే ఉందని, ఎన్నికల కమిషన్ అధీనంలోకి వెళ్లలేదని చెప్పారు.

# తిరోగాముల పురోగమనం



మన దేశానికి గల ఘనతలు ఎన్నైనా చెప్పుకోవచ్చు; సనాతన సంప్రదాయ పరంపరను ఎంతైనా కొనియాడుకోవచ్చు. అలాగని గతవైభవ సంకీర్తనలతోనే కాలం వెళ్లబుచ్చడం ఏమాత్రం వివేకమున్న పని కాదు. వర్తమానంలో చెప్పుకోదగినది ఏదీ లేనప్పుడు; భవితవ్యం అగమ్యగోచర అయోమయంగా మారినప్పుడు బుద్ధి పనిచేయక చాలామంది తమ గత వైభవాన్ని పదే పదే చెప్పుకుంటూ తన్మయంలో మునిగిపోతుంటారు. వర్తమా నంలోని వేగాన్ని అందుకోలేక, భవితవ్యంలోని అభివృద్ధిని అంచనా వేయలేక 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని వలపోస్తూ ఉంటారు. ఇలాంటి వారిది తిరుగులేని తిరోగమన ధోరణి. గత వైభవ స్తోత్రాలు వల్లించేవారు దాదాపు అన్ని రంగాల్లోనూ ఉంటారు కాని, పదవులకు శాశ్వతంగా దూరమైన రాజకీయ నాయకుల్లోను; తెరమరుగైపోయిన సినీ ప్రముఖుల్లోను; పాఠకులు పట్టించుకోని రచయితలు, కవులలోను; ఆధ్యాత్మిక ప్రవచన కర్తల్లోను తిరోగమనవాదులు ఎక్కువగా కనిపిస్తారు. బహిరంగ వేదికల మీద మైకులు దొరికితే వీరి వాగ్ధారకు మాత్రమే కాదు, వాగ్దాష్టీకాలకు కూడా అంతు ఉండదు. ఇటీవలి కాలంలో ఇలాంటి వాగ్దాష్టీకాల ఉదంతాలే వార్తలకెక్కుతున్నాయి; ప్రసార మాధ్యమాల కార్యక్రమాల్లో ప్రధాన చర్చాంశాలవుతున్నాయి; సామాజిక మాధ్యమాల్లో రణగొణలవు తున్నాయి. గత వైభవ గాథలను మితిమీరి ఊదరగొడుతుంటే, జనాలకు విసుగు పుడుతుంది. ఒక్కసారి చరిత్రను తరచి చూసుకుంటే, 'గతమంతా తడిసె రక్తమున/ కాకుంటే కన్నీటులతో' అని శ్రీశ్రీ ఎందుకన్నాడో ఎవరికైనా సులువుగానే బోధపడుతుంది. గతం నుంచి పాఠాలు నేర్చుకోని వర్తమానానికి భవిష్యత్తు ఉండదు. గతంతో పోల్చి చూసు కున్నప్పుడు వర్తమానం సాధించే ఎలాంటి పురోగతినైనా స్వాగతించాల్సిందే! గతంలో జరిగిన పొరపాట్లకు వర్తమానంలో జరిగే ఎలాంటి దిద్దుబాటునైనా హర్షించాల్సిందే! సమీప గతం పట్ల ఎరుక కలిగిన సామాన్య ప్రజానీకం వర్తమానంలో చోటుచేసుకునే ఎలాంటి సానుకూలతనైనా ఆమోదిస్తుంది. కాని, తిరోగాములకు వర్తమాన సానుకూలతలు ఇనుపగుగ్గిళ్లలా మింగుడుపడవు. తమ ఘనతకు ఎక్కడ భంగం వాటిల్లుతుందోననే భయంతో నోటికి పని చెబుతారు. ఏ వేదిక దొరికినా, సమయ సందర్భాలతో, ఉచితానుచితాలతో నిమిత్తం లేకుండా తమ లోలోపలి అక్కసునంతా వెళ్లగక్కుతారు. జనాభాలో తిరోగాములు ఇప్పుడు కొత్తగా పుట్టుకొచ్చిన వాళ్లేమీ కాదు. పురాణకాలంలోని పురాతన రాజ్యాలలోనూ ఇలాంటి కురచబుద్ధుల తిరోగాములు ఉండే వారు. వీళ్లు నిత్యదుఃఖితులు. ఇలాంటి వాళ్ల గురించే 'ఈర్ష్?యఘు ఘృణీ నసంతుష్టః క్రోధనో నిత్యశంకితః/ పరభాగ్యోపజీవీ చ షడతే నిత్యదుఃఖితాః' అని విదురనీతి చెబుతుంది. ఇతరుల పట్ల ఈర్ష్యపడేవారు; ఇతరులను నిష్కారణంగా అసహ్యించు కునే వారు; నిత్యం అసంతృప్తితో రగిలిపోయేవారు; ఉత్తపుణ్యానికే కోపంతో చిర్రుబుర్రు లాడేవారు; ప్రతి విషయాన్నీ అనుమానించేవారు; ఇతరుల భాగ్యంపై ఆధారపడి జీవించే పరాన్నభుక్కుల వంటివారు నిత్యం దుఃఖంతోనే కొట్టుమిట్టాడుతుంటారు. అంతటితోనే ఆగరు. తమ పరిసరాల్లోని మనుషుల సంతోషాన్ని కూడా హరించేస్తారు. సామాజిక వేదికలను అధిరోహిస్తే, యావత్ సమాజంలోని సుఖశాంతులకే భంగం కలిగిస్తారు. 'వివేక తిరోగమనే మూర్ఖత్వ పురోగమనం' అని రష్యన్ రచయిత తామెర్లాన్ కుజ్గోవ్ ఇలాంటి బాపతు తిరోగాముల గురించే వ్యాఖ్యానించాడు. సమాజానికి చేటు కలిగించే తిరోగాములను కనీసం సామాజిక వేదికలకు దూరంగా ఉంచడం మంచిది. లేకుంటే, వాళు మూర్ఖత్వ పురోగమనాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి కృషి చేస్తారు. వారి కృషిని సమాజం భరించలేదు. ఇటీవలే ప్రభుత్వ బిరుదాంకితుడైన ఒక ప్రవచనకర్త ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే మధ్యాహ్న భోజన పథకంలో పిల్లలకు పోషకాహారంగా గుడ్లు పెట్టడం మీద నోరుపారేసుకుని కలకలం రేపిన ఉదంతం ఈ కృషికి తాజా ఉదాహరణ. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవడం పురోగామి సమాజం బాధ్యత.

నేటి శుభోదయ

ఆదివారం - 05 - ఏప్రిల్ - 2026

# రైల్వే, ఎన్‌హెచ్ఏఐ ప్రణాళిక




## ప్రమాదాల నివారణకు కృత్రిమ మేధ

## ట్రాక్‌లపై లోపాలు గుర్తింపు

## బోగీలు పట్టాలు తప్పకముందే అప్రమత్తత

## జాతీయ రహదారులపై గుంతలు, పగుళ్ల ట్రేస్

అమరావతి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాల నివారణకు కేంద్ర రైల్వేశాఖ, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) శాఖులు ప్రత్యేక కార్యాచరణకు సన్నద్ధ మవుతున్నాయి. ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌(ఏఐ) పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ కార్యాచరణను రూపొందించాయి. రైల్వే ట్రాక్‌లపై లోపాలను ముందుగానే గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు రైల్వే శాఖ ప్రణాళిక రూపొందించగా... జాతీయ రహదారులపై 30 రకాల లోపాలను గుర్తించి సరిచేసేందుకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) సన్నద్ధమవుతోంది. ఆ మేరకు ఆ రెండు శాఖల కార్యాచరణ ఇలా ఉంది..

### పట్టాలు తప్పకముందే అప్రమత్తం చేసే సీబీఎం

రైలు బోగీలు పట్టాలు తప్పకుండా ముందుగానే గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు కేంద్ర రైల్వే శాఖ ఏఐ పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. 'కండీషన్ బేస్డ్ మానిటరింగ్(సీబీఎం) సిస్టం' పేరుతో ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. దక్షిణ కొరియాకు చెందిన గ్లోబిజ్ ఈ ఏఐ పరిజ్ఞానాన్ని రూపొందించింది. ముందుగా హైస్పీడ్ రైళ్లలో ఈ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని నిర్ణయించింది. అనంతరం దశల వారీగా ఇతర రైళ్లలో కూడా ప్రవేశపెట్టనుంది. ఏఐ ఆధారిత సెన్సార్లను రైళ్లలో ఏర్పాటు చేస్తారు. రైలు చక్రాలు, బోగీలు, తలుపులు, ఎలెక్ట్రికల్ సిస్టంలలో ఏర్పాటు చేస్తారు. రైలు ప్రయాణిస్తున్నప్పుడు వచ్చే వైబ్రేషన్లు, రైలు మెకానికల్ బిహేవియర్‌ను ఈ సెన్సార్లు రికార్డు చేస్తాయి. రైలులోనే పొందుపరిచే ఎడ్జ్ సర్వర్లు వాటిని వెనువెంటనే విశ్లేషిస్తాయి. రైలు పట్టాలపై ఎక్కడైనా లోపాలు ఉంటే రైలు వైబ్రేషన్లు, మెకానికల్ బిహేవియర్‌లో వ్యత్యాసం తెలుస్తుంది. అంటే కొంత దూరంలో ఎక్కడో ట్రాక్‌పై లోపాలు ఉన్నాయని గుర్తించి అప్రమత్తం చేస్తుంది. దాంతో వెంటనే లోకో పైలట్ ట్రైన్ వేగాన్ని తగ్గించడంతోపాటు అవసరమైతే నిలిపివేస్తారు. అనంతరం రైల్వే సాంకేతిక బృందాలు ట్రాక్ వెంబడి పరిశీలించి లోపాలను సరిచేస్తాయి. తద్వారా ముందుగానే అప్రమత్తమై రైలు పట్టాలు తప్పడం వంటి ప్రమాదాలను నివారించవచ్చు. అందుకోసం రూపొందించిన సీబీఎం విధానాన్ని దేశంలో అన్ని రైళ్లలో దశల వారీగా ప్రవేశపెట్టాలన్నదే లక్ష్యమని రైల్వే శాఖ వర్గాలు చెబుతున్నాయి.

### జాతీయ రహదారులపై డాష్‌కామ్ చెక్

జాతీయ రహదారులపై గుంతలతోపాటు ఇతర లోపాలు గుర్తించేందుకు 'డాష్‌కామ్ అనలిటిక్స్ సర్వీసెస్' పేరిట ఎన్‌హెచ్ఏఐ సరికొత్త కార్యాచరణను చేపట్టింది. అందుకోసం అత్యధిక రిజల్యూషన్ ఉన్న స్మార్ట్ కెమెరా సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. జాతీయ రహదారులపై రూట్ పెట్రోలింగ్ వాహనాలు(ఆర్‌పీవీ)లకు ఈ స్మార్ట్ కెమెరాలను అమరుస్తారు. పెట్రోలింగ్ చేస్తుంటే ఆటోమేటిగ్గా రహదారులను స్కాన్ చేస్తూ ఫొటోలు తీస్తాయి. 30 రకాల అంశాలను ఈ ఫొటోల ద్వారా గుర్తించవచ్చు. రహదారులపై చిన్న పగుళ్లు, గుంతలు, బారియర్లు లేకపోవడం, రాంగ్‌రూట్లో వాహనదారులు రోడ్లపైకి వచ్చేందుకు రోడ్లను కట్ చేయడం వంటివాటి ఫొటోలు నేరుగా 'సెంట్రల్ డేటా లేక్'పేరుతో ఏర్పాటు చేసే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతాయి. ఆ ఫొటోల ద్వారా గుర్తించిన లోపాలను ఎన్‌హెచ్ఏఐ అధికారులు సరిదిద్దుతారు. జీపీఎస్ విధానం ద్వారా లోపాలు ఉన్న ప్రదేశాన్ని కచ్చితంగా గుర్తించి మరమ్మతులు చేపడతారు. ఎన్‌హెచ్ఏఐ దేశంలో 40వేల కి.మీ. జాతీయ రహదారులను ఐదు జోన్లుగా విభజించి డ్యాష్‌కామ్ సిస్టం పరిధిలోకి తీసుకురానుంది. తద్వారా జాతీయ రహదారులపై ప్రమాదాలను తగ్గించాలన్నది ఎన్‌హెచ్ఏఐ లక్ష్యం.

# ప్రయోగాల నుంచి ప్రయోజనాల దిశగా..

## ఎంటర్‌ప్రైజ్ ఏఐ ముందున్న సవాళ్లు!




కృత్రిమ మేధ (ఏఐ) ఇప్పుడు కేవలం ప్రయోగశాలలకో, మొబైల్ యాప్‌లకో పరిమితమైన సాంకేతికత కాదు. ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సంస్థలు తమ రోజువారీ కార్యకలాపాల్లో ఏఐని అంతర్భాగం చేసుకుంటున్నాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో 'మోడల్ సామర్థ్యం' కంటే ఇప్పుడు దాని 'నిర్వహణా సామర్థ్యం' పైనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎంటర్‌ప్రైజ్ ఏఐ మనుగడకు నియంత్రణ, సమన్వయం కీలకంగా మారుతున్నాయిని ప్రముఖ సంస్థ గార్ట్‌నర్ అంచనా వేసింది.

### 2027 నాటికి 40 శాతం ప్రాజెక్టులు రద్దు?

గార్ట్‌నర్ అంచనా ప్రకారం, 2027 చివరి నాటికి సుమారు 40 శాతం ఏజెంటిక్ ఏఐ ప్రాజెక్టులు మధ్యలోనే ఆగిపోయే ప్రమాదం ఉంది. ఇందుకు కారణం.. అంచనాలకు మించి నిర్వహణ ఖర్చులు పెరగడం, వ్యాపార పరంగా స్పష్టమైన విలువ జోడింపు కనిపించకపోవడం వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదిలాఉండగా, కేవలం ఏఐ మోడల్స్‌ను కొనుగోలు చేయడం వల్ల లాభం లేదని, పని విధానాన్ని పునర్నిర్మించడం, పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారానే ఫలితాలు వస్తాయని మెకిన్సే పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.




### అడ్డంకిగా అవాస్తవ సమాచారం

ఏఐ వ్యవస్థలు ఇచ్చే సమాచారం ఎంతవరకు నమ్మదగినది? అనే ప్రశ్న ఇప్పుడు పెద్ద కంపెనీలను వేధిస్తోంది. కేపీఎంజీ 2025 నివేదిక ప్రకారం.. 54 శాతం మంది ప్రతినిధులు డేటాలో ఉన్న అశాస్త్రీయతను ప్రధాన రిస్క్‌గా భావిస్తున్నారు. 45 శాతం మంది ఏఐ సృష్టించే తప్పుడు సమాచారం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యల వల్ల పైలట్ ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలోకి రావడానికి జాప్యం జరుగుతోంది. ఇక్కడే గవర్నెన్స్(నియంత్రణ) ప్రాముఖ్యత సంతరించుకుంటోంది. ఏఐ తీసుకునే నిర్ణయాలకు ఎవరు బాధ్యత వహించాలి? ఆ నిర్ణయం వెనుక ఉన్న లాజిక్ ఏమిటి? అనే అంశాలపై స్పష్టత లేకపోతే సంస్థలు భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది.

### సమీకృత పరిష్కారం

ప్రముఖ టెక్ నిపుణుడు, ఎవాల్యుయేట్ఐక్యూ సహ వ్యవస్థాపకుడు సంజయ్ కొప్పికర్ అభిప్రాయం ప్రకారం.. ఎంటర్‌ప్రైజ్ ఏఐలో గవర్నెన్స్, సమన్వయం అనేవి విడివిడి అంశాలు కావు. ఇవి ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాలు. 'ఏఐని కేవలం అమలు చేయడం ముఖ్యం కాదు, దానిని నియంత్రించగలగడం, వివరించగలగడం, నమ్మదగినదిగా మార్చడం తక్షణ అవసరం' అని చెప్పారు.

### భారీ పెట్టుబడులు - రాబడిపై ఆందోళనలు


టెక్ దిగ్గజాలు జనరేటివ్ ఏఐ మౌలిక సదుపాయాల కోసం బిలియన్ల డాలర్లు కుమ్మరిస్తున్నాయి. నిత్యం కొత్త వెర్షన్లు, కొత్త మోడల్స్ మార్కెట్లోకి వస్తుండటంతో పాత టెక్నాలజీ త్వరగా కాలం చెల్లిపోతోంది. దీంతో పెట్టుబడిని ఎలా వెనక్కి తీసుకోవాలనే దానిపై కంపెనీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. దాంతో కంపెనీలు క్లౌడ్ కంప్యూటింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి చిన్న, ప్రత్యేకమైన మోడల్స్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ఏఐ ఇచ్చే అవుట్‌పుట్ నమ్మదగ్గదిగా ఉంటేనే క్లయింట్లు డబ్బు చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు. అందుకే ట్రస్ట్‌ను ఒక ఫీచర్‌గా కంపెనీలు అమ్ముతున్నాయి. పూర్తిగా ఏఐపై ఆధారపడకుండా మానవ పర్యవేక్షణ ఉండేలా హైబ్రిడ్ వర్క్ ఫ్లోలను డిజైన్ చేస్తున్నాయి.

# వ్యూహాత్మక ఖనిజాల వేట

సాంకేతిక, రక్షణ రంగాల్లో స్వయంసమృద్ధి సాధించే దిశగా భారత్ కీలక అడుగు వేసింది. దేశీయంగా 'రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ల' (అరుదైన అయస్కాంత ఖనిజాలు) ఉత్పత్తిని భారీగా పెంచడమే కాకుండా లిథియం వంటి కీలక ఖనిజాల అన్వేషణను వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2030 నాటికి ఏడాదికి 5,000 టన్నుల అరుదైన అయస్కాంత ఖనిజాల ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో వెల్లడించారు.

### విశాఖలో ప్లాంట్ ప్రారంభం

అణుశక్తి విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం, విశాఖపట్నంలో 'సమారియం-కోబాల్ట్' అయస్కాంతాల తయారీ ప్లాంట్ ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించింది. దీని ప్రస్తుత సామర్థ్యం ఏడాదికి 500 టన్నులు. తదుపరి దశలో దీన్ని 2,000 టన్నులకు, ఆపై 2030 నాటికి 5,000 టన్నులకు పెంచనున్నారు. నియోడైమియం-ఐరన్-బోరాన్ వంటి అధునాతన అయస్కాంతాల తయారీపై పైలట్ ప్రాజెక్టును కూడా ప్రభుత్వం చేపట్టింది.




### పెరుగుతున్న డిమాండ్.. ప్రైవేటు భాగస్వామ్యం

ప్రస్తుతం దేశంలో ఈ అయస్కాంతాల అవసరం ఏడాదికి 4,000 టన్నులుగా ఉండగా 2030 నాటికి అది 8,000 టన్నులకు చేరుతుందని అంచనా. ఈ అంతరాన్ని భర్తీ చేసేందుకు ప్రభుత్వం అణుశక్తి చట్టంలో సవరణలు తీసుకువచ్చింది. తద్వారా కీలక ఖనిజాల అన్వేషణలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి పచ్చజెండా ఊపింది. అయితే, యురేనియం వంటి వ్యూహాత్మక వనరులపై మాత్రం ప్రభుత్వ నియంత్రణ కొనసాగుతుంది.

### లిథియం అన్వేషణపై దృష్టి

ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), పునరుత్పాదక ఇంధన నిల్వలకు అత్యంత కీలకమైన లిథియం కోసం రాజస్థాన్‌లోని దేగానా, జమ్మూ కాశ్మీర్‌లోని రియాసి జిల్లాల్లో ముమ్మరంగా పరిశోధనలు సాగుతున్నాయి. దేగానాలో ప్రాథమిక సర్వేలు పూర్తయ్యాయని త్వరలోనే తవ్వకాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో 'రేర్ ఎర్త్ కారిడార్ల'ను ఏర్పాటు చేయడం ద్వారా ఖనిజ శుద్ధి ప్రక్రియను బలోపేతం చేయనున్నారు.

### వీటిని ఎందుకు ఉపయోగిస్తారు?

ఈ అరుదైన ఖనిజాలు కేవలం ఎలక్ట్రానిక్స్ కోసమే కాకుండా.. రక్షణ రంగంలో క్షిపణులు, రాడార్ల తయారీలో, అంతరిక్ష రంగంలో శాటిలైట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్‌లో, గ్రీన్ ఎనర్జీ విభాగంలో విండ్ టర్బైన్లు, ఈవీ మోటార్లలో ఇవి అత్యంత కీలకం. రాజస్థాన్, గుజరాత్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో శిలల రూపంలో ఉన్న ఖనిజ నిక్షేపాలను వెలికితీయడం కొంత సంక్లిష్టమైనప్పటికీ అధునాతన సాంకేతికతతో ఈ సవాలును అధిగమిస్తామని కేంద్రం ధీమా వ్యక్తం చేసింది.

# నేడు ఆటిజం అవేర్‌నెస్ డే

## చాట్‌బాట్

# అచ్చం అమ్మలా...

సాంకేతికతకు, సామాజిక స్పృహ తోడైతే అది మానవత్వానికి మరో అడుగు అవుతుంది. ఆటిజం ఉన్న పిల్లల కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలు, సవాళ్ల గురించి తెలుసుకున్న ముగ్గురు ఇంజినీరింగ్ స్టూడెంట్స్ 'అయ్యో!' అనుకోవడానికి మాత్రమే పరిమితం కాలేదు. తమ ఆలోచనలు, సాంకేతిక జ్ఞానానికి పదును పెట్టి ఆటిజం ఉన్న పిల్లల పేరెంట్స్‌ను అన్ని రకాలుగా గైడ్ చేసే 24/7 థెరపిటిక్ ఏఐ--చాట్‌బాట్‌ను రూపొందించి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. సాంగ్లీ (మహారాష్ట్ర)లోని రాజారాంబాపు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లో తెల్లవారుజామున అక్కడొకరు, ఇక్కడొకరు నిద్ర లేస్తున్నారు. అయితే ఒక కంప్యూటర్ ల్యాబ్ లోపల ముగ్గురు యువ ఇంజినీర్‌లు మాత్రం నిద్ర అనేదే లేకుండా దీక్షగా పనిలో నిమగ్నమయ్యారు. కోడ్‌ను మెరుగు పరుస్తూ, రెస్పాన్స్‌ను పరీక్షిస్తూ ఏఐ సిస్టమ్‌కు శిక్షణ ఇస్తున్నారు. 'న్యూరోస్టార్స్'గా పిలవబడే వైష్ణవి రాజ్‌కుమార్ పాటిల్, అభిషేక్ శివప్రసాద్, గణేష్ రామచంద్రలకు అదొక ప్రతిష్మాత్మక ప్రాజెక్ట్‌గా మారింది. ఆటిజం ఉన్న పిల్లల తల్లిదండ్రులు రోజూ ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించడంలో సహాయపడడానికి రూపొందించిన వారి ఏఐ--ఆధారిత చాట్‌బాట్ నేషనల్ ఏఐ హ్యాక్‌థాన్‌లో గ్రాస్ప్ 2026 గెలుచుకుంది. అయిదువేల మంది విద్యార్థులతో పోటీపడి ఈ ముగ్గురు 'ఏఐ ఫర్ సోషల్ గుడ్' విభాగంలో మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. లక్ష రూపాయల నగదు, మెంటర్‌షిప్ అవకాశాలు, ఇంటర్న్‌షిప్స్, ఒక యూరోపియన్ యూనివర్శిటీతో కలిసి పనిచేసే అవకాశం వారికి లభించింది.

### ఆ రోజు నుంచే...

ఈ ముగ్గురు మిత్రుల క్లాస్‌మేట్ ఒకరు ఒకరోజు తన సోదరికి ఉన్న ఆటిజం సమస్య గురించి వివరిస్తూ, తమ కుటుంబం పడే బాధలను చెప్పుకుంటూ వచ్చాడు. 'అయ్యో!' అనుకోవడానికే పరిమితం కాలేదు వారు. ఎంతోమంది యువతీయువకులతో 'యునైటెడ్ ఫర్ ఆటిజమ్' పేరుతో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఊరూవాడ, పాఠశాలలు తిరుగుతూ ఆటిజం గురించి అవగాహన పరిచేవారు. కాలక్రమంలో ఇది 'డ్రీమ్ ఉడాన్ ఫౌండేషన్' అనే రిజిస్టర్డ్ ఎన్‌జీవోగా రూపాంతరం చెందింది. 'డ్రీమ్ ఉడాన్ ఫౌండేషన్'తో ప్రయాణం ప్రారంభించిన తరువాత లోపాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోగలిగారు. మన దేశంలో ఆటిజం అనేది నిర్మాణాత్మక సవాళ్లతో కూడుకొని ఉంది. ఆటిజం గురించి బొత్తిగా అవగాహన లేని తల్లిదండ్రులు, పరిమిత సంఖ్యలో థెరపిస్ట్‌లు, అరుదైన సెషన్‌లు, అధిక ఖర్చులు... ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో ఉన్నాయి. కోవిడ్ కల్లోల కాలం తరువాత ఆటిజం కేసుల సంఖ్య 30 శాతం పెరిగిందనే వార్త ముగ్గురు మిత్రులను ఆందోళనకు గురి చేసింది.




### ఆ పరిశోధన ఫలితమే....

శాస్త్రీయమైన మార్గదర్శకత్వం ఉంటే 'ఇలా చేయాలి...అలా చేయకూడదు' అనే అవగాహన తల్లిదండ్రులకు ఉంటుంది. అయితే చాలామంది తల్లిదండ్రులకు శాస్త్రీయ మార్గదర్శకత్వం దొరకడం లేదు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని టెక్నికల్ స్టూడెంట్స్‌గా 'ఆటిజం కేర్'కు సంబంధించి అందుబాటులో ఉండే, తక్కువ ఖర్చు అయ్యే సాంకేతికత వైపు దృష్టి పెట్టిన ముగ్గురు మిత్రులు ఎన్నో పరిశోదనలు చేశారు. వారి పరిశోధన ఫలితమే.. 24/7 థెరపటిక్ ఏఐ--పవర్డ్ చాట్‌బాట్. 'ఇలా ఉండాలి... అంటూ చాట్‌బాట్‌కు సంబంధించి ఐడియా అయితే ఉందిగానీ, ఎలాంటి టూల్స్‌ను ఉపయోగించాలనేది మాకు తెలియదు' అని తొలిరోజులను గుర్తు చేసుకున్నాడు అభిషేక్. సాంకేతికతకు సంబంధించి తమ డిపార్ట్‌మెంట్ హెడ్ సహాయం తీసుకున్నారు. దీనికి ముందు...'చాట్‌జీపీటి కూడా ఆటిజంకు సంబంధించి మనం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతుంది కదా, మరి మీ ప్రత్యేకత ఏమిటి?' అని డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రశ్నించారు. దీంతో మరింత లోతుగా పర్యిశోధించాలనుకున్నారు. గూగుల్ సహకారంతో జరిగిన 'హాక్‌థాన్' వారికి ప్రోత్సాహాన్ని ఇచ్చింది. నెలరోజుల పాటు మెంటార్‌షిప్, గూగుల్ క్లౌడ్ టూల్స్‌కు యాక్సెస్ దొరకడంతో తమ సాంకేతిక విధానాన్ని అన్ని రకాలుగా మెరుగుపర్చుకునే అవకాశం వచ్చింది.

### స్కోర్ ఆధారంగా....

డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రశ్న ముగ్గురిని విస్తృతమైన పరిశోధన క్షేత్రంలోకి తీసుకువెళ్లింది. తమ అన్వేషణలో భాగంగా రీట్రైవల్--అగ్‌మెంటెడ్ జనరేషన్ (ఆర్ఏజీ), ఆగ్నెటిక్ ఏఐలాంటి సాంకేతికతను అధ్యయనం చేయడం ప్రారంభించారు. కుటుంబాలతో ఎక్కువ సమయం గడిపిన కొద్దీ ప్రతి బిడ్డ అవసరాలు భిన్నంగా ఉంటాయని, ఆ అవసరాలకు తగినట్లుగా పరిష్కారాలు ఉండాలని ఆలోచించారు. అప్లికేషన్‌లో ఏక్యూ పరీక్షను ప్రవేశపెట్టారు. ఇది ప్రామాణికమైన క్లినికల్ స్క్రీనింగ్ సాధనం. దీనిని మరింత పర్సనలైజ్‌డ్‌గా తీర్చిదిద్దారు.

'తల్లిదండ్రుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చినప్పుడు చాట్‌బాట్ స్కోర్‌ను రూపొందిస్తుంది. స్కోర్ 20 కంటే తక్కువ ఉంటే తక్కువ అని, 20 నుండి 30 మధ్య ఉంటే మధ్యస్థం అని, 30 కంటే ఎక్కువ ఉంటే సమస్య అధికం అని అర్థం. వీటి ఆధారంగా మేము సమాధానాలను సర్దుబాటు చేస్తాం' అని విపులీకరించాడు అభిషేక్. రెండో దశలో భాగంగా థెరపిస్ట్‌లతో మాట్లాడి వారు నిర్వహించే సెషన్‌లలోని విషయాల గురించి తెలుసుకున్నారు. ఆటిజం పిల్లలకు సంబంధించి తల్లిదండ్రులు రోజువారీగా ఎదుర్కొనే ఇబ్బందులు... అస్మాత్తుగా తీవ్రమైన కోపం, నిద్ర సమస్యలు... మొదలైన వాటిని దృష్టిలో పెట్టుకొని బిహేవియరల్ ట్రాకర్‌ను రూపొందించారు.

### డైలీ ట్రాకర్

పిల్లల్లో కొన్ని కీలక ప్రవర్తనలను (కీ బిహేవియర్స్) గుర్తించాం. నిద్ర తీరు, సంభాషణ, మానసిక స్థితి... మొదలైన వాటి ఆధారంగా తల్లిదండ్రులు తమ పిల్లల అవసరాలను నిరంతరం పర్యవేక్షించేలా డైలీ ట్రాకర్‌ను రూపొందించాం. తల్లిదండ్రులు రోజూ నమోదు చేసే వివరాలను వీక్లి ఇన్‌సైట్స్‌గా కన్వర్ట్ చేస్తుంది సిస్టమ్. కీలకమైన ప్రవర్తనల ఆధారంగా ఆటిజం ఉన్న పిల్లలను దృష్టిలో పెట్టుకొని డ్యాష్‌బోర్డ్ తయారవుతుంది. పిల్లలకు ఏమైనా సమస్యలు ఎదురైనప్పుడు ఏం చేయాలో తల్లిదండ్రులకు అర్థం కాకపోతే చాట్‌బాట్‌ను అడగవచ్చు. అది క్షణాల్లోనే సమాధానం ఇస్తుంది.

# జేబులో జ్యూసర్.. బాటిల్ బ్యాగ్ ఇవిగో సమ్మర్ గ్యాడ్జెట్స్




మీ సమ్మర్‌ను రిఫ్రెషింగ్‌గా మార్చే 'స్మార్ట్' మ్యాజిక్ ఇదిగో! ఈ అదిరిపోయే గాడ్జెట్స్‌తో చెమటలకు గుడ్ బై చెప్పేసి, చిల్ అవ్వండి!

జేబులో జ్యూసర్!

ఆఫీసులో ఉన్నప్పుడైనా లేదా జిమ్ పూర్తి చేసొచ్చినా, బయట దొరికే షుగర్ డ్రింక్స్ తాగి విసిగిపోయారా? ఎక్కడున్నా సరే 'ఫ్రెష్'గా జ్యూస్ చేసుకోవాలనుకుంటున్నారా? ఇందుకోసమే వచ్చేసింది ఈ రీచార్జబుల్ పోర్టబుల్ జ్యూసర్! ఇది మామూలు మిక్సీ కాదు, మీరు ఎక్కడికి వెళ్లినా వెంట తీసుకెళ్లగలిగే ఒక మినీ మ్యాజిక్ బాటిల్! పైగా దీనికి వైర్లు లేదా ప్లగ్ పాయింట్లతో పనిలేదు. ఇందులో ఉన్న పవర్‌ఫుల్ బ్యాటరీని మీ మొబైల్ చార్జర్ లేదా పవర్ బ్యాంక్‌తో చార్జ్ చేసుకుంటే చాలు. ప్రయాణాల్లో ఉన్నా, క్యాంపింగ్‌లో ఉన్నా సెకన్లలో తాజా ఫ్రూట్ జ్యూస్‌లు, స్మూతీలు రెడీ అయిపోతాయి. జ్యూసర్ లీక్--ప్రూఫ్ డిజైన్‌తో వస్తుంది, కాబట్టి మీ బ్యాగ్‌లో పెట్టుకున్నా చిందుతుందనే భయం ఉండదు. ధర రూ. 570 మాత్రమే!

### బాటిల్ బ్యాగ్!

బయటకి వెళ్ళినప్పుడు వాటర్ బాటిల్‌ను చేత్తో పట్టుకోలేక, బ్యాగ్‌లో పెడితే లోపల ఉన్న వస్తువులు తడిసిపోతాయని టెన్షన్ పడుతున్నారా? ఇకపై మీ బాటిల్‌ను స్టయిలిష్‌గా మోసుకెళ్లడానికి వచ్చేసింది ఈ వాటర్ బాటిల్ క్యారియర్ బ్యాగ్! ఇందులో బాటిల్‌తో పాటు మీ ఫోన్, డబ్బులు లేదా తాళాలు పెట్టుకోవడానికి ఒక జిప్పర్ పాకెట్ కూడా ఉంటుంది. పైగా దీనికి ఉన్న అడ్జస్టబుల్ షోల్డర్ స్ట్రాప్ వల్ల ఎవరికైనా ఇట్టే సెట్ అయిపోతుంది. వాటర్ ప్రూఫ్ మెటీరియల్‌తో తయారు చేయడం వల్ల వర్షం పడినా మీ ఫోన్, బాటిల్ సేఫ్‌గా ఉంటాయి! ఆఫీసుకైనా, జిమ్‌కైనా లేదా ట్రావెలింగ్‌కైనా ఈ బ్యాగ్ మీకు మంచి క్లాసీ లుక్‌ను ఇస్తుంది.

ధర రూ. 500 మాత్రమే!

### ఐస్ ముక్కల 'మ్యాజిక్ కప్పు'!

ఫ్రిజ్‌లో ఉన్న ఐస్ ట్రే నుంచి ఐస్ ముక్కల్ని తీయడానికి కుస్తీ పడుతున్నారా? తీరా తీశాక అవి అక్కడక్కడా విరిగిపోయి చిరాకు తెప్పిస్తున్నాయా? అయితే మీకోసం వచ్చేసింది ఈ సిలికాన్ ఐస్ మేకర్ కప్పు! ఇది మామూలు ఐస్ ట్రే కాదు, ఒక స్మార్ట్ సిలికాన్ సిలిండర్. ఇందులో నీళ్లు పోసి ఫ్రిజ్‌లో పెట్టుకుని ఐస్ తయారు చేసుకోవచ్చు. దీనికున్న చిన్న బటన్ నొక్కితే చాలు, అరవై చిన్న చిన్న ఐస్ ముక్కలు టకటకా రాలిపోతాయి! చూడటానికి కప్పులా చాలా చిన్నగా ఉంటూ, మీ ఫ్రిజ్‌లో అస్సలు చోటు ఆక్రమించదు. ఫుడ్ గ్రేడ్ సిలికాన్ తో తయారవ్వడం వల్ల చాలా సేఫ్, పైగా దీనికి ఉన్న మూత వల్ల ఫ్రిజ్‌లోని ఇతర వాసనలు ఐస్‌కు అంటుకోవు. ధర కేవలం రూ. 400 మాత్రమే!

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .